వార్త
ఆదివారం
13 నవంబరు, 2022

# జేబుకందని 'చదువులు'



## తారాతీరం



# త్వరలో 'మట్టి కుస్తీ' విడుదల

తమిళంలో స్టార్ హీరోగా ఎదగడానికి విష్ణువిశాల్ తన వంతు ప్రయత్నం చేస్తున్నాడు. తమిళ ఇండస్ట్రీలో ఆయన అడుగుపెట్టి పుష్కర కాలమైంది. ఈ మధ్య కాలం ఆయన కూడా తన తమిళ సినిమాలను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నాలు గట్టిగానే చేస్తున్నాడు. తమిళంలో ఆయన తాజా చిత్రం 'గట్ట కుస్తీ' తెలుగులో 'మట్టి కుస్తీ' పేరుతో విడుదల కానుంది. విష్ణువిశాల్‌తో రవితేజకి మంచి సాన్నిహిత్యం ఉంది. ఈ సినిమాకి విష్ణువిశాల్‌తో పాటు రవితేజ కూడా నిర్మాత కావడం మరో విశేషం. ఇందులో కథానాయికగా ఐశ్వర్య లక్ష్మి కనిపించనుంది. తమిళంలో ఐశ్వర్య లక్ష్మి ఇప్పుడు బిజీ ఆర్టిస్ట్. ఇటీవల ఓటీటీలో వచ్చిన 'అమ్ము' సినిమాతో ఆమె తెలుగు ఆడియన్స్‌కి మరింత చేరువైంది. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం సమకూర్చిన ఈ చిత్రానికి చెల్ల అయ్యావు దర్శకత్వం వహించాడు.



# ఎన్టీఆర్ చిత్రంలో జాన్వీకపూర్?

యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా ఇప్పుడు దర్శకుడు కొరటాల శివతో చేయనున్న భారీ పాన్ ఇండియా సినిమా సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ కెరీర్‌లో 30వ సినిమాగా తమ కాంబోలో రెండో సినిమాగా దీనిని ప్లాన్ చేయగా అందరికీ దీనిపై అనేక అంచనాలు ఏర్పడ్డాయి. గత కొన్ని రోజులుగా ఈ చిత్రంలో హీరోయిన్‌గా ఎవరో? అన్న ఆసక్తి నెలకొంది.

ఎప్పటి నుంచో ఎన్టీఆర్‌తో చెయ్యాలని ఉబలాటపడుతున్న బాలీవుడ్ యంగ్ హీరోయిన్ జాన్వీకపూర్ ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం గురించి ఇంతవరకు అధికారిక ప్రకటన రాలేదు. ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందిస్తుండగా, యువసుధ ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ వారు భారీ బడ్జెట్‌తో ఈ ప్రాజెక్ట్‌ని తెరకెక్కిస్తున్నారు.

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
13 నవంబరు, 2022

## మంచి ముత్యాలు

తల్లి శరీరాన్ని పోషించి పెంచుతుంది.
ఉత్తమ గ్రంథం హృదయాన్ని పోషించి పెంచుతుంది.

\- రావూరు సత్యనారాయణరావు

## విషయ విశేషం

రెడ్ వాటర్‌ఫాల్... 4
'సంఘీ'భావం....5
హద్దులు మీరుతున్న సోషల్ మీడియా
భూమికి గురుత్వాకర్షణ లేని...6
కవర్ స్టోరీ..8
జేబుకందని 'చదువులు'
ఈవారం కవిత్వం..12
చీకటి చెలిమి
అంతర్జాలంలోని ఆకాశరామన్నలను...14
పరమేశ్వరుడు కొలువైన 'మేల్పడి'..18
కథ.. 20
ప్రార్థన
సాహిత్యం.. 23
తొలి స్త్రీవాద సాహస కవయిత్రి..
టిప్పుసుల్తాన్ కలలు..26
ముళ్లపండులో సుగుణాలు మెండు ... 30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
సరదాగా కాసేపు..
వగైరా..వగైరా..



## తాజా వార్తలు

### పీచుతో కేన్సర్ ముప్పు!

పీచు ఎక్కువగా ఉండే పదార్థాలను తినడం వల్ల బరువు తగ్గ తారనీ, కేన్సర్, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులు నివారించవచ్చన్న విషయం విదితమే. అయితే అదే పీచుని ప్రాసెస్ చేసి తింటే కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందంటున్నారు టొలెడో యూనివర్సిటీ నిపుణులు. దానికోసం వీళ్లు కొన్ని ఎలుకల్ని తీసుకుని ఇనులిన్ అనే పీచుతో ఫోర్టిఫైడ్ చేసిన పదార్థాలను తినిపించారట. నిజానికి ఇది మొక్కల ఉత్పత్తుల్లో సహజంగా ఉంటుంది.

ప్రి-బయోటిక్‌గానూ పని చేస్తుంది. ఆ కారణంతో దీన్ని ఇప్పుడు ప్రాసెస్డ్ పదార్థాల్లోనూ కలుపుతు న్నారు. అలా చేసిన ప్పుడు మామూలుగా ఆరోగ్యానికి మేలు చేసే పీచు కాస్తా జీవ క్రియా లోపాలకు కారణమై కాలేయ కేన్సర్‌కు దారి తీసిందట.
ఈ రకమైన పీచుతో కూడిన ఆహారం తీసుకున్న ఎలుకల రక్తంలో పైత్య రసాలు ఎక్కువగా ఉన్నాయనీ, దాంతో ఇన్‌ఫ్లమేషన్ ఏర్పడి రోగనిరోధక వ్యవస్థ కేన్సర్ కణాల్ని గుర్తించి వాటిని నాశనం చేసే శక్తిని కోల్పోతుందనీ అంటున్నారు.
అంటే ఆహారంలో సహజంగానే ఉండే ఇనులిన్ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తే అదే ఇనులిన్ ప్రాసెస్డ్ పదార్థాల ద్వారా తీసుకున్నప్పుడు కాలేయానికి హాని కలిగిస్తున్నట్లు చెబుతున్నారు.

### స్మార్ట్‌ఫోనే స్టెతస్కోప్!

స్మార్ ఫోన్‌లో వస్తున్న యాప్‌లు అనేక రకాలుగా ఉపయోగప డుతున్నాయి. అయితే కొత్తగా రూపొందించిన ఎకోస్ యాప్, గుండెవేగాన్నీ గుర్తిస్తుందని అంటున్నారు లండన్ కింగ్స్ కాలేజీ, నెదర్లాండ్స్‌కు చెందిన మాస్ట్రిక్ట్ యూనివర్సిటీకి చెందిన నిపుణులు. అంటే ఇకనుంచి స్మార్ట్ ఫోన్లే ఎలక్ట్రానిక్ స్టెతస్కోప్‌గానూ ఉపయోగపడుతుందట. యాప్ ఆన్ చేసి ఫోన్‌కి ఉన్న మైక్రోఫోన్‌ను శరీరానికి తాకిస్తే చాలు.. అది గుండె వేగాన్ని గుర్తించి రికార్డు చేస్తుంది.

ఆ సమయంలో దూరంగా ఉన్న డాక్టర్ మానిటర్‌లో దాన్ని చూసి గుండె ఆరోగ్యాన్ని పరీక్షించవచ్చు అంటున్నారు. ఈ యాప్‌ను ప్రయోగపూర్వకంగా ప్రవేశపెట్టాక ఇప్పటివరకూ లక్ష మందికి దీని ద్వారా హృద్రోగ పరీక్ష చేయగలిగారట. కాబట్టి మున్ముందు హృద్రోగులను వైద్యులు ఇంట్లో నుంచి పరీక్షించి వాళ్ల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవచ్చని చెబుతున్నారు.



# రెడ్ వాటర్‌ఫాల్



ఆ జలపాతాన్ని చూస్తే అక్కడ రక్తపాతం జరుగుతున్నట్లే కనిపిస్తుంది. ఎర్రని రక్తధారల్లా నీరు ఉరకలేస్తూ ఉంటుంది. చలికాలంలో పూర్తిగా గడ్డ కట్టుకుపోయి, నీటి మధ్య వెడల్పాటి నెత్తుటి చారికలా కనిపిస్తుంది. ఈ రక్త జలపాతం అంటార్కిటికాలో ఉంది. టేలర్ వ్యాలీ వరకు విమానంలో చేరుకుని, అక్కడి నుండి ట్రెక్కింగ్ చేస్తూ వెళ్లాలి. అంటార్కిటికా మంచుకొండల మీదుగా ఈ జలపాతం ఉరుకుతున్న దృశ్యం సందర్శకులకు గగుర్పాటు కలిగిస్తుంది. అరుదైన ఈ జలపాతాన్ని సందర్శించేందుకు ఔత్సాహిక పర్వతారోహకులు ఉవ్విళ్లూరుతుంటారు. ఇక్కడి నీటిలో ఇనుము సాంద్రత ఎక్కువగా ఉండి, ఆ ఇనుము ఉప్పునీటి కారణంగా తుప్పు పట్టడం వల్ల జలపాతం మధ్యలో నీరు ఎర్రగా మారుతోందని అలాస్కా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ జలపాతాన్ని చూడటానికి ఏటా నవంబర్ నుంచి మార్చి వరకు సందర్శనకు అనువైన కాలం. ఈ సమయంలో దేశ, విదేశాల నుంచి ట్రెక్కింగ్ ప్రియులు, పర్యాటకులు వస్తుంటారు.





## 'సంఘీ' భావం



# హద్దులు మీరుతున్న సోషల్ మీడియా

వాస్తవాలను కుండ బద్దలు కొట్టినట్లు చెప్పడమే కాకుండా అత్యంత వేగంగా సమాచారాన్ని విశ్వవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయడంలో సోషల్ మీడియాకు మించింది ప్రస్తుతానికి మరొకటి లేదు. సోషల్ మీడియాపై సరైన ఆంక్షలు, నిబంధనలు లేకపోవడంతో ప్రయోజనాల కంటే నష్టమే ఎక్కువగా కనిపిస్తోంది. ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాకు ఉన్న పరిమితులు సోషల్ మీడియాకు లేకుండా పోయాయి. యూట్యూబ్, వైబ్ సైట్ల నిర్వహణకు అర్హత అంటూ ఏదీలేదు. ఎవరైనా ప్రారంభించుకోవచ్చు. వారికి విషయ పరిజ్ఞానం ఉందా, విద్యార్హతలు ఏమిటి, సమాజ శ్రేయస్సు కోరి ఈ వేదికను ఎంచుకున్నాడా, వర్గ, మత విద్వేషాలను రెచ్చగొట్టే అవకాశం ఉందా అన్న ఏ అంశానికి కూడా సమాధానం లభించదు. సోషల్ మీడియాలో వచ్చే అంశాలకు ఎటువంటి సెన్సార్ ఉండదు. ఒకవేళ వివాదాస్పద అంశాన్ని పోస్ట్ చేస్తే దానిపై ఫిర్యాదు చేయడానికి కూడా అవకాశం ఉండటం లేదు. ఒకవేళ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదుచేస్తే సదరు అంశాన్ని తొలగించడానికి 72 గంటల కనీసం సమయం ఉంటుందని యూట్యూబ్, గూగుల్, ట్విట్టర్, ఇన్‌స్ట్రాగ్రాం, ఫేస్‌బుక్ సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. ఇది ఎక్కువ సమయం కావడంతో జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ముందుగా ఇలాంటి అంశం సోషల్ మీడియాలో వచ్చిందని తెలియడంలోనే తీవ్ర జాప్యం జరుగుతుంది. ఇటీవల ఫేస్‌బుక్‌లో నేరగాళ్లు నకిలీ అకౌంట్‌లతో వేరొకరి ఖాతాలను తెరుస్తున్నారు. ఇందులో సాధారణ పౌరులతో పాటు ఐపిఎస్, ఐఎఎస్ అధికారుల పేరుతో ఖాతాలు తెరుస్తున్నారు. ఈ ఫేక్ అకౌంట్లతో ఫేస్‌బుక్ ఫ్రెండ్స్‌కు పోస్టింగ్‌లు పెట్టి డబ్బు వసూలు చేస్తున్నారు. నిజంగానే సదరు అధికారి డబ్బులు అడుగుతున్నారని భావించిన కొందరు నేరగాళ్ల అకౌంట్‌లో డబ్బులు వేస్తున్నారు. సదరు అధికారికి ఈ విషయం తెలిసేసరికి ఆలస్యం అవుతోంది. ఆ నకిలీ అకౌంట్ తొలగించడానికి 72 గంటల పైగా పట్టడంతో మరికొందరిని సైబర్ నేరగాళ్లు మోసగించే అవకాశం కలుగుతోంది. కొన్ని సందర్భాల్లో నేరగాళ్లు ఏ ప్రాంతానికి చెందిన వారో కూడా అర్థం కావడం లేదు. వాట్సప్‌లో ఒక మహిళ డిపిగా పెట్టుకున్న ఫోటోను నేరగాళ్లు మార్ఫింగ్ చేసి పోర్న్ సైట్స్‌లో పెట్టారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు బాధితులు తీవ్ర మనోవేదనకు గురౌతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారు. అన్ని సోషల్ మీడియా సంస్థలు మధ్యవర్తి వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని యూజర్స్‌కు అందుబాటులో ఉంచుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఆయా సంస్థలకు లక్షల్లో ఫిర్యాదులు వస్తున్నా కేవలం అందులో నాలుగైదు శాతం మాత్రమే పరిష్కారం అవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు గ్రీవెన్స్ అప్పిలేట్ కమిటీ (జిఎసి)ని నియమించాలని నిర్ణయించినప్పటికీ ప్రభుత్వం ఇప్పటి వరకు అమలులోకి తీసుకురాలేకపోయింది. అభ్యంతకర పోస్టులు పెట్టిన తరువాత మాత్రమే గుర్తించే అవకాశం ఉండటం వల్ల సోషల్ మీడియా వల్ల ఎక్కువ నష్టం జరుగుతోంది. పోస్టింగ్‌కు ముందే ఆయా సబ్జెక్ట్‌లను పరిశీలించే అవకాశం లేకపోవడం వల్ల సమస్యలు అధికంగా ఉంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసే జిఎసిలో వ్యక్తిగత భద్రత, వ్యక్తిగతమైన సమాచారం వంటి వివరాల పోస్టింగ్‌లు, ఫోటోలు, వీడియాలు మార్ఫింగ్, చిన్నారులకు నష్టం కలిగే అంశాలు, చైల్డ్ పోర్నోగ్రఫీ, ప్రజలకు, సమాజానికి నష్టం, ప్రజాజీవనానికి భంగం కలిగే అంశాలు, నేరపూరితమైన పోస్టింగ్‌లు, నేరాలను ప్రేరేపించే అంశాల అప్‌లోడింగ్, దొంగతనాలు ఎలా చేయాలని, ఆత్మహత్యలు ఏ విధంగా చేసుకోవాలి, హత్యను సాక్ష్యాలు లేకుండా ఏలా చేయాలి అన్న విషయాలపై చేసే పోస్టులు, మతాలను, కించపరిచేలా చేసేటటువంటి ఇతర అంశాలపై ఫిర్యాదుచేసే అవకాశం ఉంటుంది. చట్టం ముందు అందరూ సమానులే అన్న విషయాన్ని ప్రకటించే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు వ్యతిరేకంగా, దేశభద్రతను దెబ్బతీసే విధంగా ఉండే పోస్టులపై కూడా జిఎసీలో ఫిర్యాదు చేయవచ్చు. ఇప్పటికే కమిటీ ఏర్పాటులో జాప్యం జరుగుతూ వస్తోంది. జిఎసీ ఏర్పడి పూర్తి స్థాయిలో పనిచేయడం ప్రారంభిస్తే చాలా వరకు ఇలాంటి అభ్యంతకర అంశాలకు చెక్ పెట్టే అవకాశం వస్తుంది. అదేవిధంగా ఉద్దేశ్యపూర్వకంగా ఇలాంటి పోస్టింగ్‌లు చేసే వారిని చట్టం ముందు నిలబెట్టి శిక్షలు వేసే అవకాశం కూడా ఉంది. ఇప్పటికే సోషల్ మీడియా వెబ్‌సైట్లు, ఓటీటీలు, ఇతర డిజిటల్ వేదికలు మధ్యవర్తిత్వ అప్పిలేట్‌లను ఏర్పాటు చేసుకున్నాయి. ప్రజలు తమ అభ్యంతరాలను ఫిర్యాదులను ఆయా సంస్థల మధ్యవర్తిత్వ అప్పిలేట్‌లకు లిఖితపూర్వకంగా, ఈ మెయిల్ రూపంలో అందించే అవకాశం ఉంది. నెలరోజుల్లోగా ఈ ఫిర్యాదులపై దర్యాప్తు చేసి ఫిర్యాదికి సమాచారం ఇవ్వడం, ఫిర్యాదులో వాస్తవం ఉంటే ఆయా కంటెంట్‌ను వెంటనే తొలగించే అవకాశం ఉంటుంది. అయితే లక్షల్లో పేరుకుపోతున్న ఫిర్యాదుల పరిష్కారం అంతంత మాత్రంగానే ఉంటోంది. అదేవిధంగా ఉద్దేశ్యపూర్వకంగా అభ్యంతరకరమైన పోస్టింగ్‌లు పెట్టే వారిపై కఠినంగా చర్యలు తీసుకునే విధంగా చట్టాలను కూడా సవరించాల్సిన అవసరం ఉంది. అభ్యంతరకర పోస్టింగ్‌లు చేస్తే ఎంత నేరమో వచ్చిన పోస్టింగ్‌ను పరిశీలించకుండా ఇతర గ్రూపులకు పోస్టింగ్ చేయడం కూడా అంతే నేరమన్న విషయాన్ని సోషల్ మీడియా వినియోగదారులు గ్రహించాలి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# భూమికి గురుత్వాకర్షణ లేని రహస్య ప్రాంతాలు

ఈ భూమి మీద ఎన్నో వింతలు, విడ్డూరాలు, రహస్యాలు ఉన్నాయి. కొన్ని విషయాలను గురించి తెలుసుకుంటే కళ్ల ముందు కనిపించే వాస్తవాలు కూడా అంతా అబద్ధంగానే అనిపిస్తాయి. ఈ కోవకు చెందిన వాటిలో అత్యంత అద్భుతమైంది భూమికి గురుత్వాకరణ శక్తి లేకపోవడం. ఇది ముమ్మాటికి వాస్తవం. సహజంగా భూమి మీద మనం నిలబడి ఏ వస్తువునైనా పైకి ఎగురవేస్తే అది మళ్లీ కిందికి వచ్చి పడుతుంది. మన జేబులోంచి రూపాయి నాణెం అయినా సరే అన్ని కిందకు జారి పడాల్సిందే. వాస్తవానికి అది ఎగిరిపోదు. అంటే భూమికి గురుత్వాకర్షణ శక్తి ఉండడం వల్లనే ఇలా జరుగుతుంది.
గురుత్వాకర్షణ అంటే ద్రవ్యరాశి, శక్తి కలిగిన వస్తువులు ఒకదానినొకటి ఆకర్షించుకునే శక్తి. ఇది విశ్వ వ్యాప్తంగా విస్తరించి ఉన్న శక్తి. నక్షత్రాలు, గాలక్సీలు అన్నిటికీ, చివరకు కాంతికి కూడా గురుత్వాకర్షణ శక్తి ఉంది. భూమి మీద జీవులు, నిర్జీవ వస్తువులూ నిలబడి ఉన్నాయంటే దానికి కారణం భూమికి వున్న గురుత్వాకర్షణే. కనుకనే భూమిపై నిలబడి మనం ఏ వస్తువును విసిరివేసినా లేదా కిందకు పాడేసినా అది కిందికి పడిపోతుంది. అయితే ఈ భూమికి గురుత్వాకర్షణ లేని ప్రాంతాలు కూడా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో మాత్రం కిందకు వేసినవి భూమిపై పడకుండా పైకే వెళతాయి. ఇది కళ్ల ముందుకు కనిపించే వాస్తవం. వాటి వివరాలు:

### రివర్స్ జలపాతం, ఇంగ్లాండ్

భూమికి గురుత్వాకర్షణ శక్తి కారణంగా నీళ్ల పై నుండి కిందకు పడుతుంటాయి. కానీ ఇంగ్లాండ్‌లోని కిండర్ డౌన్ ఫాల్ దగ్గర నీళ్ల పైకి ప్రవహిస్తాయి. అందువల్లే దీన్ని రివర్స్ జలపాతం అంటారు. ఈ జలపాతం హేఫీల్డ్ దగ్గర ఉంది. ఇందేటి ఇదంతా అబద్ధం అనుకుంటున్నారా? మీరు అనుకున్నట్లు అది అబద్ధం కాదు. కిండర్ డౌన్ ఫాల్ దగ్గర నీళ్ల పైకి ప్రవహించడం వెనుక భూమి గురుత్వాకర్షణ శక్తి కన్నా బలమైన శక్తి కారణంగా ఇది జరుగుతుంది. ఈ ప్రదేశంలో నీళ్లు కిందకు ప్రవహించడానికి బదులుగా పైకే ప్రవహిస్తాయి. దీనికి కారణం గాలి అని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇక్కడ గాలి బలంగా వీస్తుంది. అంటే గురుత్వాకరణ శక్తి కన్నా బలమైన గాలులు వీస్తుండడంతో వాటి వత్తిడికి దిగువకు ప్రవహించే నీరు పైకి నెట్టబడుతుంది. ఈ అద్భుతమైన జలపాతం 78 అడుగుల ఎత్తులో ఉంటుంది.

### మంటౌ అరగట్స్

మంటౌ అరగట్స్ అనేది టర్కీ, అర్మేనియా సరిహద్దుల మధ్య ఉంది. దీన్నే గ్రావిటీ హిట్ అని కూడా అంటారు. ఇక్కడ కారు కాని స్కూటరు కాని న్యూట్రల్‌లో పార్క్ చేసినా, అది ఆటోమేటిక్‌గా పైకి వెళుతుంది. ఈ పర్వతం కింద ఎవరైనా కారు ఇంజిన్ ఆపి అక్కడే ఉంచితే దాన్ని డ్రైవ్ చేయకున్నా కూడా పైకి వెళుతుంది. దీన్ని చూసేందుకు లక్షలాది మంది ఇక్కడికి వస్తుంటారు. ఈ కొండలో ఒక నది కూడా పైకి ప్రవహిస్తుంది. ఈ అద్భుతమైన గురుత్వాకర్షణ నిరోధక దృగ్విషయాన్ని కళ్లారా వీక్షించేందుకు సందర్శకులు పోటీ పడుతుంటారు. ఆ ప్రదేశాన్ని సందర్శించే పర్యాటకులు దిగువ వైపు వెళ్లడం కంటే పై వైపునకు వెళ్లడమే చాలా సులభం అని చెబుతుండటం విశేషం. అర్మేనియా సరిహద్దులో అత్యంత ప్రసిద్ధి పొందిన పర్యాటక ఆకర్షణలలో ఒకటిగా నిలిచింది.

### శాంటా క్రజ్ మిస్టరీ స్పాట్







ఇది శాంటా క్రజ్‌లోని మిస్టరీ స్పాట్. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలోని కాలిఫోర్నియా శాంటా క్రజ్ ప్రాంతంలో దాదాపు 150 అడుగుల వ్యాసార్థంతో ఈ చెక్కఇల్లు ఉన్న ప్రాంతం ఉంటుంది. వంపు తిరిగిన చెక్క ఇంటిని చూసేందుకు సందర్శకులు ప్రతీ సంవత్సరం లక్షలాది మంది వస్తుంటారు. ఇక్కడకు వచ్చే వారు నడుస్తూండగానే పడిపోతారు. ఎందుకంటే ఇక్కడ కాళ్లు గాల్లో తేలుతాయి. అలాగే అక్కడకు వెళ్లిన వారు వంకర వంకరగా నడవాల్సి వస్తుంది. ఓ కొండను వాలుగా ఎక్కుతున్నట్లుగా ఫీలవుతారు. పర్యాటకులు ఇక్కడ ముందుకు ఒరిగినా పడకుండా ఉండగలుగుతారు. 1930 సంవత్సరంలో ఇక్కడ భూమి గురుత్వాకర్షణ శక్తి పని చేయడం లేదని పరిశోధకులు గుర్తించారు.



## హూపర్ డ్యామ్, నెవాడా

యునైటెడ్ స్టేట్స్‌లోని నెవాడా రాష్ట్రంలో ఉన్న హూపర్ డ్యామ్ అనే ఆనకట్ట ఎత్తు 726.4 అడుగులు. ఈ డ్యామ్ పైకి వెళ్లిన వారికి విచిత్రమైన అనుభవం కలుగుతుంది. ఎవరైనా కానీ ఈ పొడవైన ఆనకట్టను అధిరోహించాలని అనుకుంటే చాలు పెద్ద ఎక్సర్‌సైజ్‌లు చేయాల్సిన అవసరం లేదు. ఈ డ్యామ్ పై నుండి ఒక బాటిల్ నుండి కొంచెం నీళ్లను కిందకు పోస్తే అది కింది వైపునకు ప్రవహించడానికి బదులుగా పైకి ఆకాశం వైపునకు ప్రవహిస్తుంది. ఇది కేవలం ఒక్క నీటి విషయంలోనే కాదు. ఆ ఆనకట్ట నుండి ఏ వస్తువును కిందికి విసిరినా ఆ వస్తువు కిందికి పడకుండా తిరిగి పైకి ఎగురుతుంది. ఇలా వస్తువులు తేలుతూ లేదా నీరు పైకి ప్రవహించడానికి కారణం ఈ ప్రదేశంలోని భూమిలో గురుత్వాకర్షణ శక్తి లేకపోవడం గా పేర్కొంటున్నారు. మరి కొందరు అయితే ఈ ప్రదేశంలో వీచే బలమైన గాలుల కారణంగానే వస్తువులు, నీరు వంటివి అన్నీ కిందకు పడకుండా పైకి వెళుతున్నాయని అంటున్నారు.



సెయింట్ ఇగ్నేస్ మిస్టరియస్ రీజియన్

మిచిగాన్‌లోని సెయింట్ ఇగ్నాస్ ప్రాంతంలో భూమి గురుత్వాకర్షణ శక్తి 300 అడుగుల లోపల కూడా పనిచేయదు. కెమెరా స్టాండ్ కూడా నిటారుగా ఉండదు. ఈ ప్రాంతంలో నిలబడితే గాలిలో తేలుతూ ఉంటారు. ఈ విషయాన్ని కొందరు సర్వేయర్లు 1950 సంవత్సరంలో గుర్తించారు. వారంతా సెయింట్ ఇగ్నాస్ ప్రాంతానికి రాగానే వారి దగ్గర ఉన్న పరికరాలన్నీ పనిచేయడం మానేశాయి. ఈ ప్రాంతంలో ఇద్దరు విభిన్న వ్యక్తుల ఎత్తులు ఒకే విధంగా ఉంటాయి. ఆ ఇద్దరూ వేర్వేరు సైజుల్లో ఉన్నా అక్కడి ఓ రాయి ఎక్కి అటూ ఇటూ మారగానే ఇద్దరి సైజూ ఒకేలా ఉంటుంది. అంతేకాకుండా అక్కడి గోడలపై వాలుగా నిల్చోవాల్సి వస్తుంది. అయినా వారు కింద పడరు. అక్కడికి చాలా మంది పర్యాటకులు వెళ్లి మధురమైన అనుభూతులను పొందుతారు.

## నిషేధిత భూమి

ఒరెగాన్‌కు చెందిన అడవిలో నిషేధిత భూమి ఉంది. ఈ స్థలంలో ఒక రకమైన గోళాకారపు శక్తి కేంద్రం ఉందని బలమైన విశ్వాసం ఉంది. అందులో సగం శక్తి కింద అడుగు భాగాన, మరికొంత పై భాగాన కేంద్రీకృతమై ఉంది. ఇక్కడికి వచ్చిన సందర్శకులు వాస్తవికంగా అక్కడి పరిస్థితులను పరిశీలిస్తారు. ఈ ప్రదేశంలో గురుత్వాకర్షణ శక్తి ఉండదు. కాబట్టి అక్కడ నడవడం సాధ్యం కాదు. సందర్శకులు అక్కడి సముద్రంలో పడకుండా ఉండాలంటే గోడలను పట్టుకోవాల్సి ఉంటుంది. అక్కడ చీపురును ఉంచినా కూడా అది కిందకు పడకుండా ఎప్పుడూ నిటారుగానే ఉంటుంది. ఈ విచిత్రమైన మర్మమైన ప్రదేశంలో బాల్స్‌ను ఉంచినా కూడా అవి ఉపరితలంపైకి వస్తాయి. ఈ మాయా సంఘటనల వెనుక ఎటువంటి ట్రిక్స్ లేవనేది కనుగొన్నారు. అక్కడ గురుత్వాకర్షణ శక్తి లేకపోవడం వల్లనే ఏదైనా నిటారుగా ఉంటాయి.

**- సిహెచ్.వి.వి.రఘుబాబు**



# జేబుకందని 'చదువులు'

కవర్‌స్టోరీ

**వాసిలి సురేష్**

**తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలలో 20 నుంచి 50 శాతం వరకు పెంచి ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయి. హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌లో ఒక కార్పొరేట్ స్కూల్లో 1వ తరగతి విద్యార్థికి రూ.2 లక్షల 30 వేలు ఫీజు. 3వ తరగతి విద్యార్థికి రూ.2 లక్షల 56 వేల ఫీజు నిర్ణయించారు. కరోనా డిస్కౌంట్ పోను రూ.2 లక్షల 11 వేలు కట్టించుకుంటున్నారు.**

మొత్తం ఫీజును మూడు దఫాలుగా చెల్లించాలని యాజమాన్యాలు తల్లదండ్రులకు వివరించాయి. ఇంత పెద్ద మొత్తంలో నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఫీజుల దోపిడీకి పాల్పడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుంది తప్ప నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనించవచ్చు. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఏటా రూ.12.50 వేల కోట్ల విద్యావ్యాపారం జరుగుతున్నట్లు తెలుస్తోంది. మధ్య తరగతి, పేద కుటుంబాల కష్టార్జితంలో సగం ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకే పోతోంది. కొన్ని కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. సికిందరాబాద్‌లోని ఒక ప్రైవేటు పాఠశాలలో గత సంవత్సరం రూ.62 వేల ఫీజు ఉంది. ఈసారి ఏకంగా రూ.80 వేలకు పెంచింది. పుస్తకాలు, యూనిఫామ్స్, ట్రాన్స్‌పోర్టు ఫీజులు అదనం. ఎల్‌బి నగర్‌లోని మరొక పాఠశాలలో 5వ తరగతికి గత సంవత్సరం రూ.36 వేలు ఉండగా ఇప్పుడు రూ.50 వేలుగా నిర్ణయించింది. దాదాపు 40 శాతం ఫీజులు పెరిగాయి. వనస్థలిపురంలో ఒక ప్రైవేటు పాఠశాల అడ్మిషన్ పేరిట ఏకంగా రూ.40 వేలు కట్టించుకుంటున్నది. రెగ్యులర్ ట్యూషన్ ఫీజు కింద మరో రూ.60 వేలు. ఇలా వసూళ్లకు పాల్పడుతూ ఇంజినీరింగ్ కాలేజీ ఫీజుల స్థాయిలో ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్ల ఫీజులు దండుకుంటున్నాయి. పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగాయని స్కూళ్లల్లో ట్రాన్స్‌పోర్టు ఫీజులను విపరీతంగా పెంచాయి. 3,5,10 స్లాబ్‌లుగా విభజించి కిలోమీటర్ల చొప్పున స్లాబులు నిర్ణయించి 10 కిలోమీటర్ల లోపు ఉంటే ఏడాదికి రూ.60 వేలు చెల్లించాలంటున్నారు. ట్రాన్స్‌పోర్టు ఫీజు తల్లిదండ్రులు నెలనెలా కడతామంటే కుదరదు, కచ్చితంగా ముందుస్తుగానే చెల్లించాలని నిబంధనలు పెడుతున్నారు. గతంలో 5 కిలోమీటర్లకు రూ.15 వేలు వసూలు చేయగా ఇప్పుడు ఏకంగా రూ.25 వేలకు పెంచారు. పిల్లల ఫీజులతో పాటు రవాణా ఫీజులతో తల్లిదండ్రులపై మోయలేని భారం పడుతున్నది.

## విద్యా వ్యాపారాన్ని కట్టడి చేసేదెలా?




ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు అత్యధిక ఫీజులు వసూలు చేస్తుండటం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పెరుగుతోంది. చిన్నతనం నుంచే పిల్లలకు ఐఐటి, నీట్ ఓరియెంటెడ్ శిక్షణ అని స్కూలు స్థాయి నుంచే లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు కూడా పిల్లల కోసం ఎంతైనా ఖర్చు చేయడానికి వెనుకాడటం లేదు. అయితే కొంత మంది తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక పేదలుగా మారుతున్నారు. కొవిడ్ అనంతరం చాలా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లోకి పోవడం వల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం జరిగింది. గత రెండేళ్లగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పేరున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది.

కానీ ఈ విద్యా సంవత్సరం క్రమేపీ అడిష్మన్లు పెంచుకున్నాయి. ఫీజుల భారం పెరగడం వల్ల భారతదేశంలో 2021లో నాలుగు శాతం పైగా పిల్లలు ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ ఫీజులను పది శాతం పైగా పెంచారు. మధ్య తరగతికి చెందిన తల్లిదండ్రులపై పిల్లల చదువు వల్ల ఆర్థిక భారం పెరిగింది. అంతేకాకుండా నేడు అన్ని వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో పిల్లలకు పాఠ్య పుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫామ్, బూట్లు, సాక్స్ వంటివి కొనుగోలు చేయడం కష్టమవుతుంది. గత రెండు సంవత్సరాల్లో ఇంట్లో ఖర్చులు 50 శాతం పైగా పెరగడం, పిల్లల చదువులపై 35 శాతం పైగా ఖర్చులు పెరగడంతో సగటు మనిషి ఆదాయం కుటుంబ పోషణకే చాలడం లేదు. దీంతో స్కూళ్ల ఫీజులు కట్టడానికి అప్పుల పాలవుతు న్నారు. ప్రైవేటు స్కూల్స్ నుంచి ప్రభుత్వ పాఠశాలలకు ఒక్క ఢిల్లీలోనే దాదాపు 40 లక్షల మంది చేరినట్లు అంచనా. ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవారి సంఖ్య పెరుగుతోంది. స్కూళ్లకు పిల్లలను తీసుకుని వెళ్లే వ్యాన్లు, ఆటోలు, టెంపోల యజమానులు కూడా చార్జీలు 35 శాతం పైగా పెంచారు. స్కూలువ్యాను ఫీజులు కూడా చాలా పెరిగాయి. సిఎన్జి గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు కూడా బాగా పెరిగిన నేపథ్యంలో చార్జీలు పెంచాల్సి వస్తోందని చెబుతున్నారు.

దేశ వ్యాప్తంగా 4,50,000 ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. దాదాపు అన్ని స్కూళ్లు విద్యను వ్యాపార వస్తువుగా చూస్తున్నాయి. గత రెండు సంవత్సరాలుగా ఈ స్కూళ్లు 25 నుంచి 50 శాతం నష్టాలను ఎదుర్కొన్నాయి. అందుచేత కొన్ని చోట్ల స్కూళ్లల్లో టీచర్లను తొలగించారు. మరికొన్ని చోట్ల ఉపాధ్యాయుల జీతాలు తగ్గించారు. దీనితో సబ్జెక్టు టీచర్లను తగ్గించడం వల్ల ఉపాధ్యాయులకు అదనపు పీరియడ్స్ కేటాయించడం ద్వారా విద్యార్థులకు అందించే విద్యలో నాణ్యత తగ్గుతోంది. తల్లిదండ్రులు స్కూళ్ల యాజమాన్యానికి చెబుతున్నా పట్టించుకోవడం లేదు. తల్లిదండ్రులు తమ ఆదాయంలో 40 శాతం పైగా పిల్లల చదువు కోసమే ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాథమిక స్థాయి నుంచే పిల్లల చదువు కోసం అధిక మొత్తంలో డబ్బు వెచ్చించాల్సి రావడంతో కొందరు తల్లిదండ్రులు అప్పులు చేయాల్సి వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఉమ్మడి జాబితాలో ఉన్న విద్య కోసం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం అందిస్తున్న పాఠశాల విద్యలో నాణ్యత లేకపోవడం వల్లే తల్లిదండ్రులు ప్రైవేట్ విద్య వైపు అడుగులు వేస్తున్నారు. స్కూలువిద్య ఈ రోజుల్లో పెద్ద వ్యాపారం అయిపోయిందని,






ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా జాతీయం చేయాలనే డిమాండ్ నేడు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతున్నది. ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు వ్యాపార ధోరణిలో తమ సంస్థలను నడుపుతున్నప్పటికీ ప్రభుత్వాలు వాటిని నియంత్రించడం, చర్యలు తీసుకోవడంతో వైఫల్యం చెందడం వలన తల్లిదండ్రులు తప్పనిసరి పరిస్థితుల్లో కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలు చెప్పిన ఫీజులు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం కామన్ ఫీజు సిస్టమ్, కామన్ కరిక్యులం అన్ని స్కూళ్లు, కాలేజీలలో అమలయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కామన్ ఫీజు విధానంపై స్కూళ్ల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించడంతో ఫీజుల వసూళ్ల మళ్లీ మొదటికి వచ్చింది. రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా అయినా కామన్ ఫీజు విధానం అమలులోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.



### ఫీజులు అధికం.. సౌకర్యాలు అరకొర మాత్రమే!

మధ్య తరగతి ప్రజలు, ఎగువ మధ్య తరగతి ప్రజలు ఇటీవలి కాలంలో పిల్లలకు చదువులు చెప్పించడం కోసం వారి తల్లిదండ్రులు తమ సర్వస్వాన్ని ధారపోయడానికి సిద్ధమవుతున్నారు. ఎంతైనా ఖర్చు చేసి తమ పిల్లలకు మంచి చదువులను అందించాలని, వారికి ఉన్నత విద్య అందించాలని, వారు మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని తాపత్రయపడు తున్నారు. ఈ తల్లిదండ్రుల ఆకాంక్షలను, ఆశలను ఆసరాగా చేసుకొని ప్రయివేటు, కార్పొరేటు పాఠశాలల కాలేజీల యాజమాన్యాలు అధిక స్థాయిలో ఫీజులను వసూలు చేస్తున్నారు. రకరకాల పేర్లతో ఫీజులు వసూలు చేస్తున్నారు. ఈ ఫీజుల వసూలు అడ్డుకోవడం ఇప్పట్లో సాధ్యం అయ్యే పనిగా కనిపించడం లేదు. ప్రభుత్వాలు ఫీజులు నియంత్రణ చేయలేని స్థితిలో ఉండటం వలన, ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థలు తమ ఇష్టానుసారంగా ఫీజులు పెంచేస్తు న్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీతో సామాన్యుల జీవనం చిన్నాభిన్నమవుతోంది. అనేక స్కూళ్లల్లో అత్యధికంగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. చిన్న చిన్న తరగతి గదులు ఉంటున్నాయి. తరగతిలో సెక్షన్‌కి 40 మందిలోపు విద్యార్థులను ఉంచాలి. కానీ తరగతి గదుల్లో 70 నుంచి 80 మంది వరకు ఉంచుతున్నారు. హాస్టళ్లలో భోజనం, గదులు, బెడ్లు, టాయిలెట్లు, శుభ్రత పాటించడం లేదు. వైద్య సౌకర్యాలు ఉండటం లేదు. ఆటస్థలాలు, లైబ్రరీ, కంప్యూటరు ల్యాబ్ వంటివి ప్రకటనల్లో మాత్రమే ఉంటున్నాయి.

నిజానికి స్కూళ్లల్లో కనీస సౌకర్యాలు ఉండటం లేదు. వ్యానుల్లో పిల్లలు స్కూలుకు పోవడం గమనిస్తే వాహన సామర్థ్యానికి మించి పిల్లలను ఎక్కిస్తున్నారు. ఫీజులు సామాన్యులకు అందుబాటులో లేకపోవడం మనం గమనించవచ్చు. అంతేగాక ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో ప్రవేశం పొందుతున్న విద్యార్థులను పుస్తకాలు అక్కడే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కేవలం పుస్తకాలు, నోట్ బుక్స్, మెటీరియల్ కోసం వేలాది రూపాయలు ఖర్చు అవుతున్నది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూళ్లను తప్పనిసరిగా ప్రభుత్వం ప్రచురించిన బుక్స్ కొనుగోలు చేయాలని ఉత్తర్వులు వెలువడ్డాయి. కానీ పూర్తి స్థాయిలో అమలు కాలేదు. ప్రైవేట్ పాఠశాలల్లో అమ్ముతున్న పుస్తకాలు బయటి దుకాణాల్లో తక్కువ ధరలకు లభిస్తున్నా తప్పనిసరిగా విద్యాలయాల్లోనే కొనాలని ఆదేశాలు ఇవ్వడం వల్ల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. ఒకసారి ప్రవేశం పొందితే పాఠశాల యాజమాన్యం చెప్పిన ధరలకు యూనిఫారం, పుస్తకాలు, తదితర వస్తువులు కొనుగోలు చేయాల్సిన అవసరం ఏర్పడుతోంది. అంతేగాక పాఠశాల ఆవరణలోనే క్యాంటిన్‌లు పెట్టి తినుబండారాలు, పానీయాలు అమ్ముతుండడం గమనించవచ్చు.

పాఠశాలలు పాటించాల్సిన నిబంధనలు అన్నింటినీ తుంగలోకి తొక్కుతూ దుస్తులు, పుస్తకాలు, ఇతర స్టేషనరీ సామగ్రి కళాశాలలోనే అమ్మకం కేంద్రాలను తెరచి, యదేచ్ఛగా విద్యా వ్యాపారం చేస్తున్నాయి. ఈ విషయాలన్నిటినీ విద్యార్థి సంఘాలు, పలువురు మేధావులు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతున్నప్పటికీ వాటిపై చర్యలు నామమాత్రంగా కూడా లేవని మేధావులు, విద్యార్థి సంఘం నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికయినా విద్యా వ్యాపారాన్ని కట్టడి చేయాల్సిన





అవసరం ఎంతయినా ఉంది. ఫీజులు నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడం చేయాలి. సామాన్య ప్రజలు తమ పిల్లలను చదివించుకునేలా అందరికీ అందుబాటులో ఫీజులు ఉండేలా చేయాలి. వీలయినంత వరకు కామన్ ఫీజు విధానాన్ని తీసుకురావాలి. దీని ద్వారా అందరికీ ప్రయోజనం ఉంటుంది. అధిక ఫీజులు వసూలు చేసే విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు సరైన చర్యలు తీసుకోకపోతే ఇటు టీచర్లకు, అటు విద్యార్థి తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పవని గ్రహించాలి. ఇటువంటి పరిస్థితులను మార్చలేని స్థితిలో మన ప్రభుత్వాలున్నాయా? అనే సందేహం కలుగుతోంది. ప్రభుత్వాలు సైతం కార్పొరేటు విద్యా సంస్థలను నియంత్రణ చేయాలని పరిస్థితుల్లో ఉంటున్నాయి.

జాడ లేని ఫీజు నియంత్రణ కమిటీలు ప్రైవేటు పాఠశాలల్లో ఆర్థికపరమైన, విద్యాపరమైన విషయాల్లో యాజమాన్యాలను నియంత్రించడానికి సరైన విద్యా విధానం అందించడానికి పాఠశాల స్థాయిలో కమిటీల ఏర్పాటు తప్పనిసరి. కానీ ఇటువంటి తల్లిదండ్రుల ప్రాతినిధ్యంతో కూడిన పాఠశాల కమిటీలు మన తెలుగు రాష్ట్రాలలో ఏ ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో కనిపించడం లేదు. ప్రస్తుతం ఎక్కడా ఇటువంటి కమిటీలు ఏర్పాటు చేసిన ఆనవాళ్లు కనిపించడం లేదు. అందువల్ల ప్రభుత్వాల నుంచి సమాజం నుంచి నియంత్రణ లేని స్థితి ఏర్పడటంతో ఎవరి పాఠశాల నడపడం వారి ఇష్టంగా అయిపోయింది. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు ఏ విధంగా నిర్ణయించాలి అనే విషయంలో స్పష్టమయిన విధానం ఉంది. దీనిపై ప్రభుత్వాలు స్పష్టమయిన ఆదేశాలు ఇదివరకే ఇచ్చి వున్నాయి. ఈ ఆదేశాల ప్రకారం ప్రతీ పాఠశాలకు కచ్చితంగా గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేసుకోవాలి. ఈ కమిటీలో ఉన్నవారే ఏ తరగతికి ఎంత ఫీజులు ఉండాలి? అనేదానిని నిర్ణయించాలి. అదే విధంగా ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బందికి అంటే బోధన, బోధనేతర సిబ్బందికి ఏ విధంగా జీతాలు చెల్లించాలో నిర్ణయాధికారం ఉంటుంది. ఇటువంటి నిర్ణయాధికారం తీసుకొనే కమిటీలు ఏర్పడ్డ దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. వీటి స్వరూపం ఏ విధంగా ఉండాలంటే? ఈ పాఠశాల కమిటీకి ఒక అధ్యక్షుడు, కార్యదర్శి, నలుగురు లేదా ఐదుగురు కమిటీ సభ్యులు ఉండాలి. అధ్యక్షుడిగా ఆ విద్యా సంస్థ చైర్మన్ ఉండాలి. కార్యదర్శిగా ఆ విద్య సంస్థ కరస్పాండెంట్ లేదా మేనేజరు ఉండాలి. మిగిలిన సభ్యులుగా ప్రిన్సిపాల్ లేదా ప్రధానోపాధ్యాయులు, బోధనా సిబ్బంది నుంచి ఒకరు, పేరెంట్ టీచర్స్ అసోసియేషన్ నుంచి ఒకరు, డిఇఒ ఎంపిక చేసిన ఒక విద్యార్థి తల్లి ఉండాలి. ఈ కమిటీ జిల్లా విద్యాశాఖాధికారి ఆమోదం పొందవలసి ఉంటుంది. ఈ కమిటీలు ఎందుకు ఏర్పడలేదని అడిగేవారు ఎవరూ లేకపోవడంతో ఎక్కడా ఏర్పడటం లేదు. ఈ కమిటీల బాధ్యతలు ఏమిటంటే– పాఠశాలలో విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం, అడ్మిషన్లు ఎంత మందికి ఇవ్వాలి, నాణ్యమైన టీచర్ల ఎంపిక, పాఠశాల నిర్వహణఖర్చులు చూడటం,

నిబంధనల ప్రకారం పాఠశాలకు వచ్చే మొత్తం ఆదాయంలో 50 శాతం టీచర్లకు ఇతర సిబ్బందికి జీతాలుగా ఇవ్వడం, 15 శాతంకు తగ్గకుండా పాఠశాల నిర్వహణ ఖర్చులకు కేటాయించడం చేయాలి. కానీ ఇటువంటి కమిటీలు లేకపోవడంతో పాఠశాలల యాజమాన్యాలు సిబ్బందికి కనీస వేతనాలు కూడా ఇవ్వటం లేదు. ఈ కమిటీల ద్వారా ప్రతీ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఫీజుల నిర్ణయం జరగాలి. ఫీజుల పెంపు కమిటీ ఆమోదం పొందాలి. కానీ అటువంటి ఏమీ లేకుండానే పాఠశాలల యాజమాన్యాలు ప్రతీ సంవత్సరం 30 నుంచి 50 శాతం వరకు ఫీజులను ఇష్టం వచ్చిన రీతిగా పెంచుతున్నారు.

2014వ సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో టిఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తే కె.జి. నుండి పి.జి. వరకు ఉచిత నిర్బంధ విద్యను అందిస్తామని చెప్పిన కెసిఆర్, అధికారంలోకి వచ్చిన తర్వాత కె.జి. నుండి పి.జి. ఉచిత నిర్బంధ విద్య గురించి పట్టించుకోలేదు. ఆదాయాలను, ఆస్తులను సంపాదించుకోవడమే లక్ష్యంగా విద్యా సంస్థలు నడుస్తున్నాయి. కానీ విద్యార్థులకు విద్యను అందించి గొప్ప ఆలోచన కల్గిన మేధావులుగా తయారు చేద్దామనే ఉద్దేశం లేదు. తెలంగాణలో కార్పొరేట్, ప్రయివేటు స్కూళ్లు ఇష్టారాజ్యాంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. పేద, మధ్య తరగతి తల్లిదండ్రుల కష్టార్జితాన్ని ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలు ఫీజుల రూపంలో లాగేస్తున్నాయి.

ప్రభుత్వ అసమర్థత అవకాశవాదంతో ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు ఆడిందే ఆటగా తయారవుతున్నది. ప్రైవేటు స్కూళ్ల స్థాపన, నిర్వహణ, నియంత్రణకు సంబంధించి జీవో 1/1994 వచ్చినా అమలుకు నోచుకోవడం లేదు. జిల్లా ఫీజుల నియంత్రణ కమిటీలను (డిఎఫ్ఆర్ఈ) ఏర్పాటు చేస్తూ 2009లో వచ్చిన జీఓ నం.91ని యాజమాన్యాలు హైకోర్టులో కొట్టివేయించాయి. కనిష్ఠ ఫీజు రూ.7,800, గరిష్ఠ ఫీజు రూ.12,000లు ఉండాలని 2010లో వచ్చిన జీఓ 42ని కూడా స్టే చేయించాయి. తల్లిదండ్రుల ఆందోళన, విద్యా ఉద్యమాలు, ప్రతిపక్షాల విమర్శల ఫలితంగా ప్రభుత్వం జీఓలు యిచ్చినా, వాటిలో ఏదో ఒక లోపాన్ని జొప్పించి కోర్టుల్లో నిలబడకుండా ప్రభుత్వం పరోక్షంగా యాజమాన్యాలకే తోడ్పడుతోంది. పేద కుటుంబాల పిల్లలకు 25 శాతం సీట్లను రిజర్వ్ చేసి ప్రైవేటు స్కూళ్లల్లో ఫ్రీ ఎడ్యుకేషన్ ఇవ్వాలని, అన్ని అర్హతలు ఉన్నవారినే టీచర్స్‌గా నియమించి పూర్తి జీతాలు చెల్లించాలనే వాటితో పాటు, విద్యాహక్కు చట్టంలోని ఏ నిబంధనా అమలు కావటం లేదు. ఫీజులకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు నిరసనలు, ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో 2016 మార్చి 30న అసెంబ్లీలో విద్యా రంగంపై జరిగిన ప్రత్యేక చర్చ సందర్భంలో రాష్ట్రంలోస్కూళ్ళ, ఫీజుల సమస్య తీవ్రంగానే ఉందని ప్రభుత్వం గుర్తించింది. ఫీజుల నియంత్రణకు ప్రొఫెసర్ టి.తిరుపతిరావు ఛైర్మన్‌గా ఒక కమిటీని వేశారు. ఈ కమిటీ సిఫార్సులు కూడా అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం కమిటీ రిపోర్టును బహిర్గతం చేయలేదు. కానీ కమిటీ రిపోర్టులో ప్రతి యేటా 10 శాతం ఫీజులు పెంచుకోవాలని చెప్పిన అంశాన్ని మాత్రం ప్రస్తావించి ఈ విద్యా సంవత్సరం నుంచే పెంచుకోవచ్చని మంత్రివర్గ ఉపసంఘం ప్రకటించడంతో ఇదే అదునుగా ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు విచ్చలవిడిగా ఫీజులు పెంచి దోపిడీ చేసుకుంటున్నాయి. ఫలితంగా పేద, మధ్య తరగతి ప్రజలు సంపాదించిన సొమ్ములో 80 శాతం పిల్లల చదువులకే ఖర్చు చేస్తున్నారు. కనీస జీవనం కూడా సాధ్యం కావడం లేదు. ఇలాంటి పరిస్థితుల నుండి తల్లిదండ్రులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉంది. కనుక విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల సంఘాలు, ప్రజా సంఘాలు, హక్కుల పరిరక్షణ సంస్థలు, విద్యారంగ శ్రేయోభిలాషులు, తల్లిదండ్రులతో కలిసి ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని ప్రతిఘటించే ఐక్యవేదికలుగా ఏర్పడి పెద్ద ఎత్తున ఉద్యమిస్తే తప్ప పిల్లలకు చదువులు అందుబాటులోకి రావు.

**ఫీజుల నియంత్రణకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వాలు- అమలులో వైఫల్యం**

తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ స్కూళ్ల ఫీజులను నియంత్రించేందుకు పటిష్టమైన చట్టాన్ని తీసుకురాబోతున్నదని తెలుస్తోంది. స్కూళ్లే కాదు.. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కోర్సుల్లోనూ నిర్దిష్ట ఫీజుల విధానాన్ని ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రభుత్వం పటిష్టమైన ఫీజుల నియంత్రణ చట్టాన్ని రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**ఇప్పటిదాకా వృత్తి విద్యా కోర్సులకే..**

తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సులకే నిర్దిష్ట ఫీజు విధానం ఉన్నది. దీనికోసం తెలంగాణ ఫీజ్ అండ్ అడ్మిషన్స్ రెగ్యులేటరీ కమిటీ(టిఏఎఫ్ఆర్‌సీ) ఏర్పాటైంది. ఈ కమిటీయే మూడేండ్లకోసారి ఫీజులను ఖరారు చేస్తుంది. అయితే ప్రైవేట్ స్కూళ్లలోనూ ఫీజులను నియంత్రించాలని తల్లిదండ్రులు చాలా కాలంగా కోరుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం లోగా చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చే దిశగా చర్యలు చేపడుతున్నది. చట్టం రూపకల్పనకు ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను అధికారులు అధ్యయనం చేస్తున్నారు.

పలు రాష్ట్రాల్లో ఫీజుల నియంత్రణ ఇలా..

➤ రాజస్థాన్‌లో ఫీజులకు ఖరారు చేసేందుకు మూడు కమిటీలు ఏర్పాటు చేశారు. పాఠశాల స్థాయిలో, జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలోని కమిటీలు ఫీజులను ఖరారు చేస్తున్నాయి.

➤ ఆంధ్రప్రదేశ్‌లో స్కూళ్లు, జూనియర్ కాలేజీలకు మూడేండ్లకుగాను ఒకసారి ఫీజులను ఖరారు చేసి, అమలు పరుస్తున్నారు.



గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీలకు వేర్వేరు ఫీజు విధానాన్ని అమలు చేస్తున్నారు.

విద్యార్థుల పట్ల ప్రభుత్వాల కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టాన్ని ఏర్పాటు చేసి పకడ్బందీగా అమలు చెయ్యాల్సిన అవసరం ఉంది. తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కలలు గంటున్న పేద తల్లిదండ్రులు స్కూళ్లు, ఇంటర్ మీడియట్, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉంటున్న ఫీజులను చూసి భయపడి వారి ఆశయాలను, లక్ష్యాలను చంపుకుంటున్న సందర్భాలను గమనిస్తూనే ఉన్నాం. తెలివి, మేధోసంపత్తి, ఆలోచించే సామర్థ్యం, చదువుపై ఆసక్తి ఉన్నవారు విద్యకు దూరం కాకుండా దేశం గర్వించదగ్గ ప్రయోజకులుగా తయారు కావాలంటే పేదవారి సామర్థ్యాలను గుర్తించి ఫీజుల నియంత్రణ కోసం, ఫీజుల నియంత్రణ చట్టాన్ని ప్రభుత్వాలు తక్షణమే అమలు చెయ్యాలి. ○

# చీకటి చెలిమి



చెరువు గట్టు, సంధ్యా సమయం
ఇంటికి తిరుగు కూలీలు
ఆవులు తిరుగురాక/ దూడల అరుపులు
చెట్లపై పక్షుల కోలాహలం
పెద్దవి పెద్ద కొమ్మలనాక్రమించె
చిన్నవి తోపుల్లకు గురౌతుండె
తల్లిచెట్టు మదనపడుచుండె, మౌనం
వహించె
చీకటిపడే, అంబరము రంగు
మారిపోయె
ఎక్కడ నుంచో ఓ కమ్మని వెలుతురు
పిలువలేదు, ప్రయోజనము తెలియదు
జాబిలమ్మ, ఏమి చెప్పవలె
నీలాకాశం ఓ వింత/ నలుపాకాశం వింతలో వింత
దినచర్యలు ఖేదవు/ చీకటి చుక్కలతో ముస్తాబవు
స్తబ్దుగ చెట్లు, గుట్టలు
ఏర్పడే నీడలు/ కురిసే వెన్నెల కాంతులు
నిశ్శబ్దపు ప్రపంచం
ప్రకృతి చెక్కిళ్లపై ఘనీభవించిన కన్నీటి చుక్క
పృథివి శిఖలో మల్లెమొగ్గ, వెన్నెల ముద్దుబిడ్డ
ప్రేమచిహ్నం, అద్భుత మహల్ తాజ్
వెనుక నిత్య తేజో స్వరూపిణి
ముంజాత్ నారీమణి
దుష్ట సంఘటనలూ జరుగు
క్రూర జంతువులు వేటకు బయలుదెరె
బలహీనులు బలవు
ఆనందాశ్రమంలో విచార స్థితి.

**- త్రిపురాన శ్రీరామమూర్తి**

# నేర్పింది ఎవరు?





ఈ వారం కవిత్వం

ఏమీ చేతకాని తను/ ప్రయత్నించి నా నుండీ అన్నీ లాగేస్తోంది
తెలియంది లేదని విర్రవీగే నేను
తనలా ఆ ఒక్కటి మాత్రం చేయలేకపోతున్నాను.
ఆరుగురు శత్రువులూ పీల్చివేయగా
మిగిలిన పిప్పిని నేను/ సూర్యచంద్రులు కలిసి విరిసినట్టున్న
నిండుమనిషి తను. / అందుకే/ తనకే/ ఆ చిన్నారికే సాధ్యం
ఆ స్వచ్ఛత../ ఆ నవ్వు.
(ఆరుగురు శత్రువులు అంటే అరిషడ్వర్గాలు)

**- కళ్ళేపల్లి తిరుమల రావు**

# జీవితం రసరమ్యం

నిరంతరమై సాగే
నిశ్చల జీవిత యానంలో
జీవితం, జీవనం
రమ్యం, రసరమ్యం కావాలి.
రసరమ్య జీవితం
సరస సంగీత
సాహిత్య సమ్మేళనం.
సరసమై, స్వారస్యమై
మలయానిల పవన సదృశమై
మనోభిరామమై సాగాలి.
నిశ్చల నిర్మల ప్రమోదమై
రసప్లావితం కావాలి.. మనసు
మమతానురాగాల సారథిగా
రసరమ్య రాగాల వారధిగా
మధుర మకరంద
జీవితానంద పెన్నిధిగా
జీవితం, జీవన
పావనమై వర్ధిల్లాలి.

**- యలమంచిలి శివాజీ**

## కవితా పుష్పాలకై రాలిన ఊహలు




ఏనుగు నరసింహారెడ్డి జగమెరిగిన కవి, విమర్శకుడు, అనువాద రచయిత. దాదాపు 300 ముక్తకాలతో వివిధ సందర్భాలలో ముత్యాల్లా రాలిన ఆయన ఊహలను ఒడిసిపట్టి ఓ చిరుపొత్తం ప్రకటించారు. పేరు 'పూల పూల వాన: 'ప్రకృతి పూసిందని కాదు/ పాప నవ్విందని/ కురిసింది/ పూలపూల వాన' పాప నవ్వులోని స్వచ్ఛత, పరిమళాన్ని విరబూసిన పూలతో పోలుస్తున్నాడు కవి. 'పుస్తకాల్లో కూడా/ పువ్వులు పూస్తాయి/ పరిమళం పేరు/ జ్ఞానం' ఎన్ని గ్రంథాలు చదువుతేనేం? వాటిల్లోని జ్ఞానాన్ని యిముడ్చుకోలేనప్పుడు. 'పూలకే ఖరీదు/ తోటలో బేరమాడినా/ సువాసనకు ధరల్లేవ్', పద్యానికి భావమే పరిమళం. ఆ పరిమళాన్ని అద్దిన కవితాశక్తికి ఏ ధర అని నిర్ణయిస్తాం! 'చలినీ వేడినీ/ వేరు చేస్తుంది/ ఏమో అనుకున్నా/ దుప్పటి కూడా ఒక హంసే', పాలనీ, నీటినీ వేరు చేసే హంసతో పోలుస్తున్నాడు దుప్పటిని. గొప్ప ఊహ. ఊహేగా కవిత్వానికి ప్రాణం. 'పని చేయకుండానే/ ఎలా అలసిపోవచ్చో/ సచివాలయాని కొచ్చి/ తెలుసుకోవచ్చు' ఏనుగు వారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారి. ఆయన నిజాయితీని మెచ్చుకోకుండా ఉండలేం. యిలా వైవిధ్య భరిత కవితా పుష్పాల పరిమళాన్ని ఆస్వాదించాలనుందా? రండి..పూలపూలవాన తడుద్దాం! ఆ చిరుజల్లు పులకరింతలో పరవసిద్దాం!

**(పూల పూల వాన, రచన: ఏనుగు నరసింహారెడ్డి, వెల: రూ 100, ప్రతులకు: ఇ.నం.3-14-50, విజయశ్రీకాలనీ, సహారారోడ్డు, వనస్థలిపురం, హైదరాబాద్)**

**- రమణ వెలమకన్ని**

## చిత్రపు కథల సంపుటి 'వర్ణ చిత్రం'



రచయిత ఈ కథల సంపుటిని తన జీవన సహచరి విజయలక్ష్మికి అంకితం చేసారు. ప్రముఖ సాహితీవేత్త శ్రీవిహారి, తాళ్లపల్లి మురళీధరగౌడు చక్కటి ముందు మాటలు రాసారు. ఈ సంపుటిలో 28 కథలున్నాయి. చాలాకథలు ఆలనాటి ఆంధ్రసచిత్ర వారపత్రికలో (1966 ప్రాంతం) ప్రచురణ పొంది పాఠకాదరణ పొందాయి. కథలన్నీ మధ్యతరగతి వారి వాస్తవ జీవన చిత్రణలుగా నిలుస్తాయి. 'వర్ణచిత్రం'లోని కథలన్నీ-నాలుగు దశాబ్దాల క్రితం తెలుగు వారి జనజీవనం ప్రత్యేకించి మధ్యతరగతి జనజీవనం ఎలా ఉండేదో రికార్డు చేశాయి. చాలాకథలు ప్రేమ, పెళ్లి, పెళ్లి తర్వాత జీవితం సంసారం, దాంపత్యం విషాదాలు వియోగాలు వెంకటపతి పెళ్లి (పేజీ.70), కొండల్‌రావు ప్రేమకథ (పేజీ.142), రోమియో (పేజీ.206) పద్మావతి పెళ్లి (పేజీ.398), ఇంటికి దీపం (పేజీ.242) వంటి కథలు చెపుతాయి. ఒక ఆఫీసర్‌ను ఇద్దరు యువతులు ప్రేమించారు. ఎవరు గెలిచినా రెండవవారు ఓటమి అంగీకరించాలి అనే ఒప్పందం చేసుకొంటారు. ఇద్దరూ పరిణత మనస్వినుల అంతరంగ ఆవిష్కరే 'గెలుపెవరిది' కథ. (పేజీ.263). విధివిలాసం చెలిమి, సంస్కరం రెక్కలొచ్చిన పక్షిలాంటి కథలు పాఠకుల్ని ఏక బిగువున చివరి వాక్యం దాకా చదివిస్తాయి. నీరజలా ఆలామంది మోహన్‌రావులాంటి వారి చేతిలో శీలం కోల్పోయే సందర్భాలు నేడు చూస్తున్నాం. ఓ మంచి కథలు చదివాం అనే అనుభూతికి లోనుకాగలం.

**(వర్ణచిత్రం, రచన: చిత్రపు హనుమంతరావు, వెల: రూ350, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్)**

**- తంగిరాల చక్రవర్తి**

# పుస్తక సమీక్ష

## ప్రసన్న కథా కలితార్థయుక్తి

'ప్రసన్న కథా కలితార్థయుక్తి' కీ॥శే.డా॥భట్టి ప్రోలు దుర్గాలక్ష్మి ప్రసన్న జీవన ప్రస్థానగత రచనలు ప్రచురింపచేసిన సద్గ్రంథం. డా॥దుర్గాలక్ష్మి విద్యాధికురాలైన సాహితీవేత్త, మేధావిగా జీవిత సాఫల్యత సాధించిన జిజ్ఞాసిగా స్మృతిపథంలో నిలిచేవిధంగా ఈ గ్రంథంలోని ప్రతి అక్షరం పరిమళిస్తోంది. ఆమె రాసుకున్న డైరీలోని భావోద్వేగ శకలాలు అంతరంగాన్ని ఆవిష్కరిస్తున్నాయి.



సాహిత్య పిపాసి, విజ్ఞురాలు, సృజనశీలిగా డా॥ దుర్గాలక్ష్మి కుటుంబ సభ్యులకు కాకుండా బంధు, మిత్ర, సన్నిహిత సమాజానికి స్ఫూర్తి ప్రదాతగా జీవించారని, హిందీ ఉపన్యాసకురాలిగా, ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారిగా అమృత వాత్సల్యంతో అందరినీ రంజింపచేసారని ఈ జీవన ప్రస్థానం స్పష్టంచేస్తోంది. అస్తిత్వవాద పరిశోధనాన్వేషిగా రచనా వ్యాసంగాన్ని కొనసాగించి, మరువలేని, స్మరణీయ ఆత్మీయ అనుబంధ మాధుర్యాన్ని డా॥దుర్గాలక్ష్మి పంచి పెట్టారని ఈ గ్రంథంలోని జీవిత, రచనా ఆత్మీయ అక్షర భావనలు స్పష్టంపచేస్తున్నాయి.

**(ప్రసన్న కథా కలితార యుక్తి, రచన: డా॥బి.ఎస్.ఆర్.ఆంజనేయ శర్మ, ప్రతులకు: ఇ.నం.11-301, సౌభాగ్యపురం కాలనీ, కొత్తపేట, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్-500035)**

**- ఎర్రమిల్లి**

## వంశీవారి చిన్న కథల సంకలనం

నానాటికీ పెరిగిపోతోన్న 'యాంత్రికత' సాహిత్యంపైన కూడా తన ప్రభావం చూపుతోంది. ఏడాది పొడుగునా సాగే పత్రికల్లో సీరియళ్లు, నవలలు, పెద్ద కథలు, కథల్లోంచి పాఠకులు చిన్న కథల వేపు మళ్లుతున్నారు. ఇన్‌స్టంట్ యుగం సాహిత్యంలో కూడా ప్రవేశించింది. సాంస్కృతిక సాహిత్య సేవారంగాల్లో ఎనలేని సేవలందించిన వంశీ ఆర్ట్స్ థియేటర్ వారు తమ స్వర్ణోత్సవాల సందర్భంగా సాహితీకిరణం మాసపత్రికతో కలిసి అందించిన 'వంశీ స్వర్ణోత్సవ కథా సంకలన'మిది. అంతర్జాతీయ స్థాయిలో సింగిల్ పేజీ కథల పోటీ నిర్వహించి పోటీకి వచ్చిన 50 కథలనెన్నుకుని ఈ సంకలనంలో ప్రచురించారు. తెలుగులో మొట్ట మొదటి మహిళా రచయిత్రి భండారు అచ్చమాంబ పోటీ ముఖచిత్రంగా అలరారే ఈ సంకలనాన్ని 'మేటి కథల మూట' అనవచ్చునేమో! మానవత్వం (రిక్వెస్ట్‌స్టాప్) అవినీతిని ఎండగట్టడం (కుక్కనుకొడితే) ఆత్మాభిమానం గల పని మనుషులు, (ఆత్మాభిమానం) మనసు దుర్గంధభరితమైతే ఎన్ని సెంట్లు పులుముకున్నా నిష్ప్రయోజనం (దుర్గంధం) విధి విన్యాసాలు సామాన్యులకు అర్థం కావు. ఏం జరిగినా మంచి కొరకే (జీవన చదరంగం) లాంటి విలువల్ని తెలిపే మంచి కథలివి. వంశీ, వేగ్నేష, ఘంటసాల, ఫౌండేషన్‌ల వంశీ రాజరాజుకు అభినందనలు.



**(వంశీ స్వర్ణోత్సవ కథా సంకలనం. 50మంది రచయితల కథలు, వెల: రూ.150, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్)** **- కూర చిదంబరం**



# అంతర్జాలంలోని ఆకాశరామన్నలను అడ్డుకునేది ఎవరు?

**ఈదర శ్రీనివాసరెడ్డి**

చిన్నతనంలో పాఠశాలలో తరగతి జరిగేటప్పుడు పక్కవాడితో మాట్లాడితే ఉపాధ్యాయులు విద్యార్థుల భరతం పట్టేవాళ్లు. కానీ మనసు ఊరుకోదు కదా? అందుకే పక్కవాళ్లతో మాట్లాడటానికి చిట్టీల ద్వారా సందేశం పంపేవాళ్లు. ఆ చిట్టీలు గనుక టీచర్ల కళ్లపడ్డాయో ఇక అంతే. ఆ చీటీ రాసినవాడి వీపు విమానం మోత మోగేది. అందుకని టీచర్లకు దొరకకుండా ఉండాలని ఊరు, పేరు లేకుండా ఆకాశ రామన్నల పేరుతో చీటీలు పంపడం మొదలుపెట్టేవాళ్లు కుర్రాళ్లు. టీచర్లు కూడా తామేమీ తక్కువ తినలేదని ఆకాశరామన్న చీటీ దొరికితే క్లాసుమొత్తాన్ని బెంచీల మీద నిలబెట్టేవాళ్లు. చీటీలో విషయం ఏమిటి? అనేదానికన్నా చీటీ ఎవరు రాశారు? అన్నది లేకపోవడంతో టీచర్లు అగ్గి మీద గుగ్గిలం అయ్యేవాళ్లు. దీనికి కారణం.. ఎవరైనా సరే తప్పయినా ఒప్పయినా తమ అభిప్రాయాలను తెలియజేసినప్పుడు ధైర్యంగా నిజాయితీగా వాటికి కట్టుబడి ఉండే విలువలు విద్యార్థులు విస్మరిస్తున్నారని ఉపాధ్యాయులు భావించడమే. ఏ వ్యక్తి అయినా తాను ఏం చెప్పదలచుకున్నాడో, ఎలా చెప్పదలచుకున్నాడో, స్పష్టమైన ఆలోచనలతో తన అభిప్రాయాలను వ్యక్తపరచాలి, వ్యక్తపరచిన వాటికి కట్టుబడి ఉండాలి.

మన పెద్దలు 'చేసిన మంచి చెప్పుకోకూడదంటారు' కాబట్టి ఒకవేళ ఆకాశ రామన్నలు ఏదైనా మంచి కార్యం కోసం ఇటువంటి అనామక ఉత్తరాలుగానీ ఊరు పేరు లేని సమాచారాన్నిగానీ జనంలోకి పంపితే అప్పుడు పెద్దగా మనం వాళ్ల గురించి ఆలోచించాల్సిన అవసరం ఏముంది. పూర్వం ఎంతోమంది దాతలు, ధార్మికులు పెద్ద పెద్ద దానాలు చేసి కూడా తమ పేరు బయటకు చెప్పుకోవడానికి ఇష్టపడేవాళ్లు కాదు. అదే విధంగా ఓ గొప్ప కవిత్వంగానీ, శతకంగానీ, ప్రజలను ఉత్తేజపరిచే రచనగానీ వెలువడినప్పుడు, వాపి కృతికర్తలు తమ పేర్లు వెలుగు చూడాలని ఏనాడూ భావించేవాళ్లు కాదు. ఇటువంటి దాతలు, ధార్మికులు, కవుల వల్ల సమాజానికి మంచే జరుగుతుంది కనుక వారి పేర్లు తెలియకపోయినా పెద్ద నష్టమేమీ లేదు. కానీ నేడు రాజకీయాల దగ్గర నుండి సామాజిక మాధ్యమాల వరకు అనుక్షణం ఆకాశ రామన్నలు పంపే నకిలీ సమాచారంతో మన దైనందిన జీవితం అతలాకుతలమవుతోంది. నేడు మన చుట్టూ ఓ చీకటి ప్రపంచం నెలకొని ఉన్నదని మరువరాదు, దాని పేరే సైబర్ లోకం. ఈ సైబర్ లోకం నిండా నకిలీ పేర్లతో అబద్ధపు చిరునామాలతో చీకటి ముసుగులు తగిలించుకున్న ఆకాశ రామన్నలు, ఆకాశ సీతమ్మలే మనకు తారసపడతారు. ఇంకా చెప్పాలంటే కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే మరమనుషులు కూడా మానవ ముసుగులు ధరించి మనల్ని మోసం చేయడానికి తయారుగా ఉన్నాయని మనం గ్రహించాలి. ఈ ఆకాశ రామన్నలందరూ సామాజిక మాధ్యమాలలో ఎదుటి వ్యక్తిని తమ మాటలతో రాతలతో మానసికంగా చిత్రహింసలకు గురి చేస్తూ రాక్షస ఆనందాన్ని పొందే వ్యక్తులు. ఒక రకంగా వీరందరూ మానసిక రోగులు అని మనం గుర్తించాలి.

ఒకప్పుడు పెద్దల మాట సద్దిమూట అని వారి మాటకు యువత విలువనిచ్చేవాళ్లు. కానీ నేడు పెద్దవాళ్ల మాటల కన్నా సామాజిక మాధ్యమాల్లోని అనామకుల మాటలకే విలువ ఎక్కువగా ఉంటోంది. అబద్ధాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ, వాటిని సమర్థిస్తూ ఓ పది మంది లైక్‌లు కొట్టడం ద్వారా ఆ అబద్ధమే నిజమని నమ్మించేవాళ్లు నేడు ఎక్కువగా మనకు తారసపడుతున్నారు. పరదాల చాటున దాక్కుని, నిర్లక్ష్యంగా, విచ్చలవిడిగా బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించే ఈ ఆకాశ రామన్నల వల్ల సామాజిక మాధ్యమాల ప్రతిష్ఠ మసకబారుతోంది. రాజకీయ నాయకులు తమ ప్రత్యర్థులను అగౌరవపరచడానికి ఈ సామాజిక మాధ్యమాలను వాడుకుంటూ ఉంటే, మరికొంత మంది ఎదుటి వ్యక్తుల సమాచారాన్ని, ఛాయాచిత్రాలను తమ ఇష్టం వచ్చినట్లు మార్పులు చేసి హింసించడానికి ఉపయోగిస్తున్నారు.

ఇటువంటి అసత్య ప్రచారాల వల్ల అసలు సత్యమేదో తెలుసుకోవాలన్న ఆలోచన మరచి సామాజిక మాధ్యమాలు వినియోగించే వాళ్లంద రూ మానసికంగా బద్ధకస్తులుగా మారుతున్నారు.



ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ఉపయోగించే కంప్యూటర్ ప్రోగ్రాముల మీద ఎటువంటి అజమాయిషి లేకపోవడంతో ఈ ప్రోగ్రాములు తయారు చేసేవారు ఏదో ఒక రాజకీయ పార్టీకి అమ్ముడుపోయి వారికి కొమ్ము కాస్తూ అసలు నిజాల్ని దాచి అబద్ధాలను ప్రచారం చేయడం మనం ఎక్కువగా చూస్తున్నాం. ఇటీవల కాలంలో తమకు నచ్చని సినిమా హీరోల చలనచిత్రాలను దెబ్బ తీయడానికి సైతం వీటిని వినియోగించడం జరుగుతోంది. రాజకీయాలు కానివ్వండి, సినీ పరిశ్రమ కానివ్వండి, వ్యాపార సామ్రాజ్యం కానివ్వండి.. వీటన్నిటిని కొంతమంది తమ గుప్పెట్లో పెట్టుకుని ఇష్టారీతిన రాజ్యాలను ఏలుతూ తమ ప్రత్యర్థులను తొక్కివేయటానికి ఎటువంటి అనైతిక పనులకు పాల్పడటం నేడు కోకొల్లలుగా మనకు సామాజిక మాధ్యమాల్లో తారసపడుతున్నాయి. ఇటీవల కాలంలో లోన్ యాప్‌ల ద్వారా అప్పు తీసుకుని తీర్చలేనివారిని మానసికంగా చిత్రహింసలు చేసి చివరికి వారి ప్రాణాలు తీసుకునేట్లు చేస్తున్నారు. ఇది అనాగరిక ఆకాశ రామన్నలు చేస్తున్న పని. ఇటువంటి వారి వల్ల సమాజంలో విద్వేషాలు, అలజడులు, అసహనం పెరిగిపోయి సమాజం మొత్తం వర్గాలుగా విడిపోయే ప్రమాదం కూడా లేకపోలేదు. సామాజిక మాధ్యమాలలో ఉపయోగించే కంప్యూటర్ ప్రోగ్రాముల మీద ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో రోజురోజుకు ఇటువంటి అనైతిక కార్యకలాపాలు ఎక్కువవుతున్నాయి. ఒక తుపాకినిగానీ, ఒక తుపాకీ గుండునుగానీ ఎటువంటి అనుమతులు లేకుండా అనవసరంగా ఉపయోగిస్తే వారిని నేరస్తులుగా పరిగణించి చట్టం శిక్షలు విధిస్తుంది. అదే తుపాకీ గుండు కన్నా ఎంతో శక్తివంతమైన సమాచారాన్ని దుర్వినియోగపరిచే వారి మీద చట్టం ఏమాత్రం తన ప్రభావం చూపలేకపోతోంది. తుపాకీ గుండు కేవలం ఒక మనిషి గుండెను మాత్రమే చీల్చగలదు, అదే సామాజిక మాధ్యమాల్లో నేడు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న అసత్య ప్రచారాలు సమాజం మొత్తాన్ని చీలుస్తోందని మనం గ్రహించలేకపోతున్నాం. అసత్య ప్రచారాలను, నీలి చిత్రాలను, లైంగిక వేధింపులను ఆధారంగా పనిచేసే ఎన్నో అనవర్తనాలు నేడు సామాజిక మాధ్యమాల్లో విషపు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వాలు వందల సంఖ్యలో వీటిని అడ్డుకుంటూ ఉంటే, వేల సంఖ్యలో చావులేని రావణాసురుడి తలకాయల్లా పుట్టుకొస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఈ ఆకాశ రామన్నలు పంపే సమాచారాన్ని ఆధారంగా చేసుకుని పత్రికా విలేకరులను, రాజకీయ ప్రత్యర్థులను, ప్రభుత్వాలను విమర్శించేవారిని అరెస్టులు చేయడం కూడా జరుగుతుండటం అత్యంత దురదృష్టకరం.



సామాజిక మాధ్యమాల్లో ఇటువంటి ఆకాశ రామన్నలకు చోటు లేకుండా చేస్తే అంతర్జాలంలోని వనరులను దుర్వినియోగం కాకుండా కాపాడిన వాళ్లమవుతాం.

గత కొంత కాలంగా మన పోలీసులు నల్లటి ఫిల్ములు చీకటి తెరలతో రోడ్ల మీద ప్రయాణించే వాహనాలకు అనుమతులు రద్దు చేసినట్లే, సైబర్ పోలీసులు కూడా సైబర్ రోడ్ల మీద తిరిగే ఈ ఆకాశ రామన్నల ముసుగులు తొలగించాల్సిన అవసరం ఉంది. కేవలం అంతర్జాలంలోనే ఈ ఆకాశ రామన్నలు మనకు తరాసపడతారనుకుంటే పొరపాటు. సమాజంలో అనేక రూపాల్లో అనేక సందర్భాల్లో మనకు

**(మిగతా 22వ పేజీలో)**

కథ

# తల్లి రుణం

మోహన్ ఒక పెద్ద సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. మంచి జీతం, మంచి జీవితం అతనికి లభించాయి. నిజానికి మోహన్ కలవారి కుటుంబంలో జన్మించలేదు. బాల్యంలోనే తండ్రి చనిపోయాడు. తల్లి కస్తూరి నాలుగు ఇళ్లల్లో పాచిపని చేసి మోహన్‌ను బాగా చదివించుకుంది. మోహన్‌కు భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

తల్లి వృద్ధురాలైంది. వృద్ధాప్య కారణంగా ఆరోగ్యం సహకరించక ఆమె మరుగుదొడ్డికి వెళ్లేలోపు అక్కడక్కడా మలవిసర్జన చేసేది. అదేరోజు పనిమనిషి వచ్చేది కాదు. మోహన్ భార్య ఆ మలాన్ని శుభ్రపరచేది కాదు.



"ఆమె నీ తల్లి. కాబట్టి సేవ చేయవలసిన బాధ్యత నీపై ఉంది. నాకు సంబంధం లేదు" అని కచ్చితంగా చెప్పేది. మోహన్ విసుక్కుంటూ, బాధపడుతూ ఇంట్లో పడిన మలాన్ని శుభ్రపరచేవాడు. తల్లిని నానా చీవాట్లు పెట్టేవాడు.

ఒకసారి మోహన్‌కు తాను పని చేస్తున్న సంస్థ తరఫున ఒక నెలపాటు విదేశాలకు వెళ్లవలసి వచ్చింది. అతను ఒక మిత్రుడి ఇంట్లో నెలపాటు ఉండటానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ మిత్రుడి ఇంట్లో ఒక కుక్క ఉంది. మోహన్ దాన్ని చాలా ఆప్యాయంగా నిమురుతూ చనువుగా ఉండేవాడు. ఒకరోజు సెలవు కావడంతో మోహన్ ఆ కుక్కను ఉదయంవేళ తీసుకుని వీధిలో నడకకు బయలుదేరాడు. దారిలో ఆ కుక్క మలవిసర్జన చేసింది. మోహన్ దాన్ని పట్టించుకోకుండా తన దారిన తాను నడుస్తూ వెళుతున్నాడు.

ఆ వైపుగా వెళుతున్న పోలీసు అధికారి మోహన్‌ను నిలువరించాడు.

"మా దేశంలో ఎవరితో ఉన్న కుక్క అయినా సరే వీధుల్లో మలవిసర్జన చేసినట్లయితే కుక్కను వీధుల్లోకి తెచ్చేవారే ఆ మలాన్ని తీసి రహదారి పక్కనున్న చెత్తకుండీలో వేయాలి. అలా చేయకపోతే ఈ దేశంలో జైలుశిక్ష విధిస్తారు" అని ఆ పోలీసు అధికారి హెచ్చరించాడు.

మోహన్ చేసేది లేక చెత్తకుండీల వద్ద ఏర్పాటు చేసిన కాగితాలను తీసుకుని కుక్కమలాన్ని స్వయంగా ఎత్తి చెత్తకుండీలో వేశాడు. ఈ పని చేసి మోహన్ చాలా బాధపడ్డాడు. "జన్మనిచ్చిన తల్లిమలాన్ని ఎత్తడానికి ఎంతో చిరాకు పడ్డాను. జన్మనిచ్చిన తల్లిపై విసుక్కుని చీవాట్లు పెట్టాను. ఈ దేశంలో నాకు సంబంధం లేని కుక్కమలాన్ని ఎత్తవలసి వచ్చింది. అదే సేవ తల్లికి చేస్తే ఆమె ఋణం తీర్చుకున్నట్లవుతుంది. పైగా పుణ్యకార్యం కూడా" అని మోహన్ మనసులోనే మదనపడ్డాడు.

విదేశాల నుండి తిరిగి రాగానే తన తల్లికి స్నానం చేయించడానికి, అనునిత్యం ఆలనా పాలనా చూసుకోవడానికి ఒక పనిమనిషిని ఏర్పాటు చేశాడు. తాను, తన భార్య ఉద్యోగానికి వెళ్లినప్పుడు పనిమనిషి తల్లని జాగ్రత్తగా చూసుకునే ఏర్పాటు చేశాడు. ఉద్యోగం నుండి తిరిగి వచ్చిన తరువాత తల్లి మంచి-చెడులను విచారించేవాడు. ఏనాడూ విసుగు చెందకుండా చక్కగా చూసుకుంటూ తల్లిరుణాన్ని తీర్చుకున్నాడు.

**- షేక్ అబ్దుల్ హకీం జాని**

## బాలగేయం

### బాలల పండుగ



వచ్చింది వచ్చింది
చిన్నారుల పండుగ
తెచ్చింది తెచ్చింది
ఆనందం మెండుగ.
భారత తొలి ప్రధాని
నెహ్రూ జన్మదినం
అవనిలో బాలలకు
అసలైన పర్వదినం
"చాచా"తో పిల్లలకు
చెలిమి కుదిరిన రోజు
చిన్నారుల మనసుల్లో
నెహ్రూ వెలసిన రోజు.
పండిట్ నెహ్రూజీకి
బాలలంటే ప్రాణం
వారితో గడపడం
భలే భలే ఇష్టం!
పిల్లలతో గడపడం
పెంచును అనుబంధం
పంచును ఆనందం
హృదయాల్లో అమితం.

**- గద్వాల సోమన్న**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- బి.ప్రసాదిని,** కోదాడ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. క్రికెట్‌లో మొదటి ప్రపంచకప్ నిర్వహణ ఎప్పుడు జరిగింది?

**జవాబు: ప్రసాదిని!** తొలి పరిమిత ఓవర్ల మ్యాచ్‌ను 1971లో మెల్బోర్న్ (ఆస్ట్రేలియా) క్రికెట్ మైదానంలో నిర్వహించారు. ప్రయోగాత్మకంగా నిర్వహించిన ఈ మ్యాచ్ అన్ని దేశాల క్రీడాకారులను ఆకర్షించింది. గొప్ప ఖ్యాతిని సంపాదించు కోగలిగింది. పర్యవసానంగా 1975లో ఐసిసి తొలి ప్రపంచ కప్‌ను ఇంగ్లండ్‌లో నిర్వహించింది. ఇందులో టెస్ట్ మ్యాచ్‌లు ఆడే దేశాలన్నీ పాల్గొన్నాయి.

**- ఇ.ఏడుకొండలు,** తిరుచానూరు

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. పనసకాయలు చెట్టు మానుకే ఎందుకు కస్తాయి?

**జవాబు: ఏడుకొండలు!** కొమ్మ రెమ్మ, దానికి పూత, పిందె, కాయ.. ఇది ప్రకృతి సహజం. పనసపండు(జాక్ ఫ్రూట్) చెట్టుకు గల బాగా ఎదిగిన మానుకు కాస్తుంది. ఆడపుష్పాలు(పూత) మాను మీద లేదా బాగా ఎదిగిన కొమ్మల మీద పూస్తాయి. వృక్షాలు అందించే పండ్లలో చాలా బరువుండే పండు ఇదే. సుమారు 35 కిలోల బరువు వుంటుంది. ఇంత బరువు మోయాలంటే మానుకే సాధ్యమవుతుంది. మరో ఉదాహరణ.. ఆగ్నేయాసిలో డ్యూరియస్ చెట్టు కూడా నాలుగు కిలోల బరువుండే పండ్లను కాస్తుంది.

పనసచెట్లు, డ్యూరియన్ చెట్లు బాగా మందమైన మాను నుంచే గుత్తులు గుత్తులుగా పూత, పిందెలు ఏర్పడతాయి. పనసచెట్టుకు మగ, ఆడ పుష్పాలు విడివిగా వుంటాయి. మగ పుష్పాలు కొత్తగా ఎదుగుతున్న ఆకులలో ఆడ పుష్పాలకు ఎగువన కనిపిస్తాయి. ఆడపుష్పాలు పొట్టిగా, లావైన మొగ్గలతో మానును ఆధారం చేసుకుని కన్పిస్తాయి.

ఆలయాల రాష్ట్రం తమిళనాడులోని అనేకానేక చారిత్రక ప్రసిద్ధి చెందిన ఆలయాలు గల గ్రామాలలో ఒకటి మేల్పడి. వెల్లూరు జిల్లాలోని ఈ గ్రామంలో నెలకొల్పబడిన రెండు ఆలయాలది ప్రత్యేక స్థానం. వీటిల్లో ఒకటి: శ్రీ సోమనాథేశ్వర స్వామి ఆలయం కాగా రెండవది శ్రీ చోళేశ్వర స్వామి ఆలయం. ప్రస్తుతం ఈ రెండు చారిత్రక నిర్మాణాలు పురావస్తు శాఖవారి ఆధ్వర్యంలో ఉన్నాయి.

# పరమేశ్వరుడు కొలువైన 'మేల్పడి'

శ్రీ సోమనాథేశ్వరవారి ఆలయాన్ని ఒకటవ పరాంతక చోళుడు నిర్మించినట్లుగా శాసనాల ఆధారంగా తెలియవస్తోంది.

**పావన పాలరు నది**

కర్ణాటక రాష్ట్రంలోని నేటి చిక్కబళ్లాపుర జిల్లాలోని నందికొండల్లో ఉద్భవించి తొలుత ఆ రాష్ట్రంలో తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొంత భాగం చివరికి తమిళనాడులో అత్యధిక భాగం ప్రవహించి వయలూర్ వద్ద బంగాళాఖాంతలో సంగమిస్తుంది పాలార్ నది. ప్రవాహ మార్గంలో సుమారు ఏడు దాకా ఉపనదుల ప్రవాహాన్ని తనలో కలుపుకొని వేలాది ఎకరాలను సస్యశ్యామలం చేస్తూ, ఎన్నో నగరాల నీటి అవసరాలను తీరుస్తుంది పాలార్ నది. ఈ పావన నదీ తీరంలో ఎన్నో విశేష ఆలయాలు నెలకొల్పబడ్డాయి. వాటిలో భాగమైన ఈ రెండు ఆలయాలు ఒకదానికి ఒకటి ఎదురెదురుగా నిర్మించబడ్డాయి.

**శ్రీ సోమనాథేశ్వర స్వామి ఆలయం**

మేల్పడి గ్రామాన్ని గతంలో ఒకటవ రాజరాజ చోళుని పేరు అయిన 'రాజాశ్రయపురం' అని పిలిచేవారు. ఆ కాలంలో ఈ ప్రాంతం చోళ, రాష్ట్రకూట సామ్రాజ్యాల సరిహద్దు ప్రాంతం. రాజకీయంగా కీలకమైనదిగా గుర్తించబడింది. అత్యధిక కాలం చోళుల ఆధీనంలో ఉన్నప్పటికీ రాష్ట్ర కూట రాజు మూడవ కృష్ణ పాలనలో కొంత కాలం వారి పాలనలో ఉండిందని శాసనాల వల్ల తెలుస్తోంది.



విశాల ప్రాంగణంలో రెండు ప్రాకారాలతో నిర్మించబడిన ఈ ఆలయానికి సంబంధించి ప్రత్యేక పురాణ గాథ ఏదీ అందుబాట్లో లేదు. చోళుల ఆరాధ్య దైవం అయిన మహేశ్వరునికి మరో ఆలయాన్ని నిర్మించి తమకు అప్రతిహతంగా లభిస్తున్న విజయాలకు కృతజ్ఞత తెలుపుకోవాలన్న భావనతో ఈ ఆలయాన్ని ఒకటవ పరాంతక చోళుడు నిర్మించాడన్న అభిప్రాయాన్ని తెలియజేస్తున్నారు చరిత్రకారులు.

**ఆలయ విశేషాలు**

తూర్పు ముఖంగా ఉండే ఆలయానికి దక్షిణం పక్కన రాజగోపురం లేని



ప్రధాన ద్వారం గుండా ప్రాంగణంలోకి ప్రవేశిస్తే రెండో ప్రాకారం వెళ్లే ద్వారానికి మూడు అంతస్థుల గోపురం ఉంటుంది. గోడల పైన చిన్న చిన్న శిల్పాలను చక్కగా చెక్కారు.

రెండో ప్రాకారంలో ఉన్న కళ్యాణ మండపం, ఇతర మండపాల స్తంభాల పైన శ్రీ గణపతి, శ్రీ వీరభద్ర, శ్రీ భైరవ, సప్త మాతృకలు, కంకాళనాథర్, వృషభనాథర్, గంగాధరుడు, సూర్య, చంద్ర, నాగులు తదితర రూపాలను ప్రాణం లేని రాతి మీద జీవకళ ఉట్టిపడేలా మలిచారు ప్రజ్ఞావంతులైన శిల్పులు.

నాటి శిల్పుల గొప్పదనాన్ని తెలిపే పెద్ద రాతి నీటితొట్టి ఆలయ ప్రాంగణంలో కనిపిస్తుంది. ఎలా చెక్కారా? అని ఆశ్చర్యం కలుగుతుంది చూపరుల మదిలో.

ఉపాలయాలలో శ్రీ గణపతి, అమ్మవారు శ్రీ తపస్కృత దేవి కొలువైన దర్శనమిస్తారు.

సహజంగా ఎక్కడైనా గర్భాలయం పైన ఉండే విమానాన్ని పలుచని ఇటుకలను సున్నపు పూతతో ఏర్పాటు చేసి చక్కని శిల్పాలుగా మలుస్తారు. కానీ మేల్పడిలోని రెండు ఆలయాల విమానాలను నల్ల, ఆకుపచ్చని మరకత శిలలతో నిర్మించారు.

ఈ విధంగా నిర్మించిన విమానాలు కలిగిన ఆలయాలు చాలా అరుదు అని చెప్పవచ్చు. సహజంగా మూలవిరాట్టుకు ఎదురుగా ఉండే ధ్వజస్తంభం, నంది ఇక్కడ ముఖమండపానికి వెలుపల



ఉండటం చెప్పుకోదగిన విషయం. నందీశ్వరుడు స్వామిని చూడటానికి వీలుగా రాతితో కిటికీ మలచిన విధానం గొప్పగా ఉంటుంది. గర్భాలయానికి ఎదురుగా ఉన్న ముఖ మండపం గుండ్రటి స్తంభాలతో ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఈస్తంభాల మీద ఎలాంటి శిల్పాలు ఉండవు. గర్భాలయానికి ఇరుపక్కలా ఉన్న నిలువెత్తు ద్వారపాలకుల విగ్రహాలు గంభీరంగా కనిపిస్తాయి. వారి ఆభరణాలు, ఆయుధాలు సహజత్వానికి దగ్గరగా వుండటం విశేషం. గర్భాలయ వెలుపలి గోడలలో శ్రీ గణేష, శ్రీ దక్షిణామూర్తి, శ్రీ సోమనాథేశ్వర స్వామి చందన, విబూది రేఖలతో కుంకుమ, పుష్ప అలంకరణలో సర్పభూషణం ధరించి నేత్రానందంగా దర్శనం అనుగ్రహిస్తారు. పురావస్తు శాఖవారి ఆధ్వర్యంలో ఉఅన్న నిత్య పూజలు జరుగుతాయి. అమావాస్య, పౌర్ణమి, త్రయోదశి పూజలు జరుపుతారు. నియమంగా నాలుగు పూజలు నిత్యం నిర్వహిస్తారు. శివరాత్రికి విశేష సంఖ్యలో భక్తులు తరలి వస్తారు.



శ్రీ చోళేశ్వర స్వామి ఆలయం

చోళేశ్వర స్వామి ఆలయం సోమనాథేశ్వర స్వామి ఆలయానికి ఎదురుగా ఉంటుంది. తెలుసుకోదగిన ముఖ్య విషయం ఏమిటంటే ఇది ఆలయం కిందకి రాదు. వెయ్యి సంవత్సరాలకు ముందు ఈ ప్రాంతాన్ని పాలించిన ఒక చోళ రాజు సమాధి. సమాధి మీద నిర్మించిన ఇలాంటి నిర్మాణాలను 'పళ్లిపడై ఆలయం' అని పిలుస్తారు. నేడు శ్రీ చోళేశ్వర స్వామిగా పిలవబడుతున్న ఆలయం ఒకటవ పరాంతక చోళ మహారాజు ఆఖరి పుత్రుడైన 'అరింజయ చోళుని సమాధి మందిరం. ఆయన పాలించింది తక్కువ కాలమైనా రాజ్యం పైన తనదైన ముద్ర వేశారని చరిత్ర గ్రంథాల వల్ల అవతమౌతుంది. అరింజయుడు ఇక్కడికి సమీపంలోని ఆరూర్ వద్ద జరిగిన సమరంలో 967వ సంవత్సరంలో అసువులు బాశారని తెలుస్తోంది. ఆయన పార్థివ శరీరాన్ని పాలరు నదీ తీరంలోని మేల్పాడి వద్ద సమాధి చేశారట.

తదనంతర కాలంలో ఆయన మనుమడైన ఒకటవ రాజరాజ చోళుడు తాత మరణించిన నలభై ఏడు సంవత్సరాల తరువాత 1014వ సంవత్సరంలో ఆయన సమాధి మీద ఈ ఆలయాన్ని నిర్మించినట్లుగా గర్భాలయ వెలుపలి గోడల పైన ఉన్న శాసనాలు తెలియజేస్తున్నాయి. ఈ ఆలయం విమానంతో సహా పూర్తిగా రాతి నిర్మితం. ఈ నలుచదరపు నిర్మాణంలో ధ్వజస్తంభం, బలిపీఠాలు లాంటివి కనిపించవు. ఒక చిన్న ముఖ మండపం, గర్భాలయం మాత్రమే ఉంటాయి.

ముఖ మండపంలో నందీశ్వరుడు కొలువై ఉంటారు. గర్భాలయ వెలుపలి గోడల పైన రాజరాజ చోళుడు, రాజేంద్ర చోళుడు వేసిన వివిధ కాలాలకు చెందిన శాసనాలు కనపడతాయి. గర్భాలయానికి నలువైపులా శ్రీ దక్షిణామూర్తి, శ్రీ మహావిష్ణు, శ్రీ బ్రహ్మ, శ్రీ విష్ణుదుర్గ కొలువై కనపడతారు.

ఈ పరివార దేవతల పై భాగాన శ్రీ కన్నప్ప, ఋషి పత్రులతో ఉన్న శివుని మరో రూపం అయిన భిక్షందార్, శివపూజ చేస్తున్న ఒకటవ రాజరాజ చోళుడు శిల్పాలను సుందరగా మలచారు.

గర్భాలయ ద్వారానికి ఇరుపక్కలా నిలువెత్తు ద్వారపాలక విగ్రహాలు ఉంటాయి. చిన్నదైన గర్భాలయంలో మూడు అడుగుల ఎత్తయిన లింగ రూపంలో శ్రీ చోళేశ్వర స్వామి చక్కని పుష్ప అలంకరణలో దర్శనమిస్తారు.

ఎలా వెళ్లాలి?

పురావస్తు శాఖవారి ఆధ్వర్యంలో ఉన్న ఈ ఆలయంలో నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. వెయ్యి సంవత్సరాల చరిత్రకు మౌనసాక్షిగా నిలిచిన ఆలయాల నియలమైన మేల్పాడి పాలరు దనీ తీరంలో పచ్చని పొలాల మధ్య చక్కని పల్లె వాతావరణానికి మారు పేరులా ఉంటుంది.

ఈ చారిత్రక ప్రసిద్ధి చెందిన ప్రదేశం వెల్లూరుకు ముప్ఫై కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎలాంటి వసతి, భోజన సౌకర్యాలు లభించవు. సమీపంలోని తిరువాళం, వల్లిమలై లాంటి ప్రదేశాలను మేల్పాడితో కలిపి దర్శించడం ఉత్తమం. అన్నీ పక్క పక్కనే ఉంటాయి. విశేష పౌరాణిక, చారిత్రక నేపథ్యం కలిగివున్న ప్రదేశాలివి. అద్దెకు వాహనం తీసుకొని వెళ్లడం సౌకర్యంగా ఉంటుంది. అన్ని రకాల వసతి, భోజన సౌకర్యాలు వెల్లూరు(కాట్పాడి)లో లభిస్తాయి. దేశంలోని అన్ని ప్రాంతాల నుండి రైలు మార్గంలో కాట్పాడి చేరుకోవచ్చు.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**




కథ

# ప్రార్థన

**జిల్లేళ్ల బాలాజీ**

పచ్చని తోరణాల మధ్య.. పందిరి కింద.. పెళ్లిపీటల మీద పసుపు దుస్తుల్లో ఆ ఇద్దరు!
పురోహితుడు మంత్రాలు వల్లిస్తూ పెళ్లితంతును జరిపిస్తున్నాడు.
ఒక మూలగా నిలబడి నిర్లిప్తంగా, నిరాసక్తితో చూస్తోంది ప్రార్థన.
"నమస్తే! బావున్నారా?" ఎవరో పలకరించారు.
తుళ్లిపడి వాస్తవంలోకొచ్చిన ప్రార్థన తల తిప్పి ఆ వ్యక్తి చూస్తూ ప్రతి నమస్కారం చేసింది.
"ఎవరితను?" వెంటనే తన జాబితాలోని ముఖాలన్నింటినీ ఒకసారి గుర్తుకు తెచ్చుకుంది.
"ఆ.. గుర్తొచ్చాడు. జాబితాలోని లాస్ట్ నెంబర్.. 'పందొమ్మిది' కదూ?!"
చిన్నన్నయ్య స్నేహితుడు. పైగా తను ఇతణ్ణి అంత త్వరగా ఎలా మర్చిపోగలుగుతుంది?
"ఈమె నా భార్య, పేరు సుప్రజ!" నవ్వుతూ భార్యను పరిచయం చేశాడు నెంబర్ పందొమ్మిది.
"ఎన్నో భార్యో?" మనసులో అనుకుంటూ ఆ యువతి వైపు చూసింది ప్రార్థన.
తనకు నమస్కరిస్తున్నా... ఆమె చూపులు పక్కనున్న ఆడవాళ్లు కట్టుకున్న పట్టుచీరల మీదే ఉంది.
నవ్వుకుంది ప్రార్థన.
"మీకీ జన్మలో పెళ్లయ్యే యోగం ఉందంటారా?" భార్యకు వినబడకుండా వ్యంగ్యంగా అన్నాడు నెంబర్ పందొమ్మిది.
"ఏం? లేకపోతే మీరు ఉంచుకుందామను కుంటున్నారా?" అంతే వ్యంగ్యంగా అంది ప్రార్థన.
ఔనన్నట్టుగా కళ్లెగరేశాడతను.
'రాస్కెల్!' ఆ మాటలకి తను అవమానంతో కుంగిపోతునుకుంటున్నాడు.



ఈడియెట్! మునుపటి ప్రార్థనను కాదు తను, ఏడుస్తూ కూర్చోవటానికి!" చివుక్కున తల తిప్పి ఎటో చూడసాగింది ప్రార్థన.
"ఇదేనా రావటం! కమాన్ రండి.. రండి!" అంటూ నెంబర్ పందొమ్మిదిని లాక్కెళ్లాడు ప్రార్థన్న చిన్నన్నయ్య గోకుల్.
వెళుతూ వెళుతూ.. వెనక్కు తిరిగి ప్రార్థనను చూసి కన్ను గీటాడతను.
'వైల్డ్ బీస్ట్!' మనసులో గొణుక్కుంది ప్రార్థన.
ఆ మృగం గురించిన ఆలోచనలు ఆమెను చుట్టుముట్టాయి.

.....

"చెల్లికి పెళ్లి చేయాలనే తలంపు మాకెవ్వరికీ లేదనే కదూ.. మీ నిష్టూరాలూ, ఈ డొంక తిరుగుడు ప్రశ్నలూనూ! చూడు నాన్నా.. అన్ని లక్షణాలు సక్రమంగా ఉన్న అమ్మాయిలకే లక్షలకు లక్షలు కట్నం అడుగుతున్న రోజులివి.
మనం కట్నం కోసం కూడా వెనకాడ్డం లేదు నాన్నా. కానీ, అదే.. ప్రార్థన అనాకారితనమే దాని పెళ్లికి అడ్డంకిగా తయారైంది. ఈ పరిస్థితుల్లో నేనో నిర్ణయం తీసుకున్నాను నాన్నా! అందుకు మీ అనుమతి కావాలి" అంటూ తండ్రి ముఖంలోకి చూశాడు గోకుల్.
"చెప్పమన్నట్టు" మెల్లగా తలాడించాడు వాసుదేవరావ్.
"మా ఆఫీసుకు ఈ మధ్యనే ఒకతను ట్రాన్స్‌ఫర్ మీద ఇక్కడికొచ్చాడు. పాపం! అతని భార్య చనిపోయిందట. అతను మన ప్రార్థన విషయం విని పెళ్లి చేసుకుంటానన్నాడు. ఏమంటావు నాన్నా?" అతనికి ఇదివరకే పెళ్లయిన విషయం ప్రార్థనకు తెలియనివ్వకూడదు. ఈ విషయాన్ని అతణ్ణి కూడా దాచమని చెబితే– "అలాగే" అంటూ తన ఇద్దరి పిల్లల్నీ తీసుకెళ్లి ఎక్కడో దూరంగా ఉండే బోర్డింగ్ స్కూల్లో చేర్పించేస్తానన్నాడు. అంతేకాదు, కట్నం యాభై వేలకు మించి ఒక్క పైసా కూడా ఎక్కువ తీసుకోనన్నాడు. ఇంతకంటే మంచి సంబంధం ప్రార్థనకు రాకపోవచ్చు నాన్నా!" తండ్రి ముఖంలోకి ఆసక్తిగా చూస్తూ అన్నాడు గోకుల్.
ఏం సమాధానం చెప్పకుండా అక్కణ్ణించి మౌనంగా వెళ్లిపోయాడు వాసుదేవరావ్.
మౌనం అర్ధాంగీకారమా?!

.....

ఈ సంభాషణంతా తాను వినకున్నా ఎంత బావుణ్ణు?
అయినా బాధనిపించలేదు.
నాన్న మౌనం ఆయన నిస్సహాయతను తెలియజేస్తోంది.
ఏదో విధంగా తాను ఇక్కణ్ణించి వెళ్లిపోవటమే వాళ్లకు కావాల్సింది. అయినా తన గురించే వీళ్ల ఆలోచనంతా! మరి అక్క విషయం ఏం చేద్దామని? అందరూ ఆమెను అంత త్వరగా మర్చిపోయారా? ఎందుకిలా మారిపోయారు?
చిన్నన్నయ్య స్నేహితుడు తనను చూడ్డానికి పెళ్లిచూపులకు వచ్చినపుడు తాను మామూలుగానే అంగీకరించింది.
అతని ముందుకు వెళ్లబోతూ గోడ మీద రాసిన 'పద్దెనిమిది' అన్న నెంబరుకు అడ్డుగా ఒక గీత గీసి, పక్కనే 'పంధొమ్మిది' అన్న నెంబర్‌ను రాసి పైటను సర్దుకుంటూ అతనికెదురుగా వెళ్లి కూర్చుంది.
కాసేపయ్యాక అతనితో ఒంటరిగా మాట్లాడాలని కోరింది.
ఏకాంతంలో "నాదొక చిన్న విన్నపం మన్నిస్తారు కదూ!" అంది అతని ముఖంలోకి చూస్తూ.

"ఏంటో చెప్పండి" తనను ఎక్కడెక్కడో చూస్తూ అన్నాడు నెంబర్ పందొమ్మిది.

"మా వాళ్లు మీరు కోరినంత కట్నం ఇస్తున్నారు. దాంతో పాటు మరొక పదివేలు ఎక్కువిచ్చే ఏర్పాటు నేను చేస్తాను. దయచేసి మా అక్కను పెళ్లి చేసుకుంటారా?" అభ్యర్థిస్తున్నట్లుగా అంది తను.

"ఏం? మీ అక్కనింకా ఎవడూ తగులుకోలేదా?" ఎగతాళిగా అన్నాడు నెంబర్ పందొమ్మిది.

సర్రున వచ్చిన ఆవేశాన్ని అణచుకుంటూ "మా అక్కకు పెళ్లయిందండీ! కానీ దురదృష్టవశాత్తు మా బావగారు పెళ్లయిన ఏడాదికంతా ఒక ఆక్సిడెంట్‌లో చనిపోయారు" కళ్లల్లో నీళ్లు తిరగడంతో తల దించుకున్నాను.

"ఛత్.. మొగుడు చచ్చిన ఆడదాన్ని చేసుకోవటానికి నన్నేమైనా చవటనుకుంటున్నావా?" ఆవేశంతో అన్నాడతను.

"అలా అనకండీ, అక్క తలరాత.. ఆమెను వైధవ్యం ప్రాప్తించింది. మీరు మంచివారనీ, సహృదయులనీ వేడుకుంటున్నాను. విధివశాత్తు భార్యను పోగొట్టుకున్న మీరే అక్కను తిరస్కరిస్తే ఇక ఆమె జీవితం ఎలా సార్?"

"ఓ..! నా భార్య చనిపోయిన విషయం నీకు తెలుసన్నమాట. అయినా సిగ్గు లేకపోతేసరి, ఆ మాట అడగటానికి.."

"ఇందులో సిగ్గు పడాల్సిన విషయం ఏముందనీ? కారణాలేమైనా మీ భార్య మిమ్మల్ని ఒంటరివాణ్ణి చేసి వెళ్లిపోయింది. మీ పిల్లల్ని మీరొక్కరే పెంచి పెద్ద చెయ్యాలంటే ఎన్ని కష్టాలు పడాలో నేనూహించగలను. అందుకే మీరు మరో పెళ్లికి ముందుకొచ్చారు. మీ పిల్లల్ని కన్నతల్లిలా చూసుకునేందుకు మా అక్క కూడా ఒప్పుకుంది. దయచేసి కాదనకండి.."

"నేను ఒప్పుకున్నది నిన్ను పెళ్లి చేసుకోవాలనే.. కానీ మీ అక్కను కాదు. అయినా చూడూ.. నిన్నే చేసుకోవాలని అనుకోవటం ఎందుకో తెలుసా? నీలో అందం లేకపోవచ్చు. కానీ మిగతావన్నీ నా రసిక హృదయానికి ఏమాత్రం అడ్డు కావు. ఇక మీ అక్క.. ఇదివరకే ఒకరికి అర్పించేసిన.." అంటూ ఇంకేదో వాగబోయిన నెంబర్ పంధొమ్మిదికి అడ్డొస్తూ-

భార్య చనిపోతే భర్త రెండో పెళ్లికి ముందుకొచ్చారు. మరి మేం ఆడవాళ్లం కనుక అలా ధైర్యంగా ముందుకు రాలేకపోతున్నాం. అంతమాత్రాన చులకన చేసి మాట్లాడ్డం భావ్యం కాదు.

"ఏమండీ! అనవసరంగా ఏదేదో మాట్లాడకండి. భార్య చనిపోతే భర్త రెండో పెళ్లికి ముందుకొచ్చారు. మరి మేం ఆడవాళ్లం కనుక అలా ధైర్యంగా ముందుకు రాలేకపోతున్నాం. అంతమాత్రాన చులకన చేసి మాట్లాడ్డం భావ్యం కాదు. దయచేసి మా అక్కకు మరో జీవితాన్ని ప్రసాదించండి" రెండు చేతులూ జోడించి అర్థించింది.

ఓ క్షణం నిశ్శబ్దం.

"ఒకే! అలాగే చేసుకుంటాను. కానీ ఒక షరతు! అప్పుడప్పుడు నిన్ను నాకు అర్పించుకోవాలి. అదీ పెళ్లికి ముందు ఒక్కసారి, జస్ట్ శాంపిల్‌గా. దట్సాల్!" పళ్ళికిలిస్తూ అన్నాడు నెంబర్ పంధొమ్మిది.

"మీలో సభ్యతా, సంస్కారం మరీ ఇంత ఎక్కువ మోతాదులో ఉంటుందనుకోలేదు" వడివడిగా అక్కణ్ణించి వచ్చేసింది.

ఈ విషయాలేవీ తనవాళ్లకు చెప్పలేదు తను.

రెండు రోజుల తర్వాత-

"అమ్మా! మీ ఇద్దరి జాతకాలు చక్కగా కుదిరాయి. వచ్చే నెల పదకొండవ తారీఖున పెళ్లి ముహూర్తం.."

"దాన్నిటివ్వు నాన్నా" అంటూ నాన్న చేతిలోని కవరును విసురుగా లాక్కుంది ప్రార్థన.

పొంతనాల కాగితాలు, లగ్నపత్రికా ఉన్నాయందులో.

"ఎంత డబ్బుకు అతణ్ణి కొంటున్నాం నాన్నా?" తనకేమీ తెలియనట్టే అడిగింది ప్రార్థన.

ఆమె ముఖంలోకి చూడలేక ఎటో చూస్తూ ఉండిపోయాడాయన.

"ఫర్వాలేదు నాన్నా, ఎంతో చెప్పు!"

"పెళ్లి మనమే జరిపిస్తున్నాం కనుక దాదాపు ఓ యాభై వేలు దాకా.." అంటూ అబద్ధమాడే ప్రయత్నం చేశాడు.

"దాంతో ఏదైనా వ్యాపారం మొదలెట్టండి నాన్నా. వచ్చే ఆదాయంతో ఇంట్లోని అవసరాలైనా తీరతాయి. అంతేకానీ ఎవడో ముక్కూ మొహం తెలీనివాడి చేతికి అంత డబ్బు ఎందుకివ్వటం?"

"అతను నీక్కాబోయే భర్తమ్మా. ఇవ్వటం మన సంప్రదాయం"

"నేనలా అనుకోవటం లేదు నాన్నా.. అయినా నేనిక్కణ్ణించి వెళ్లిపోవటమే కదూ మీక్కావలసింది?"

"అమ్మా! ఏమిటా మాటలు?"

"అలా కాదని మీరనుకుంటే, దయచేసి ఇకమీదట నా పెళ్లి ప్రయత్నాలు మానండి"

"ఎలాగమ్మా, పెళ్లి కాకుండా ఆడపిల్లను ఎన్నాళ్లని ఇంట్లో.."

"నాకు పెళ్లి కాకపోవటం మీకు గుండెల మీద కుంపటిలా ఉంది కదూ! అయితే అక్క కూడా ఆడదే కదా నాన్నా, మరి ఆమె మీకు భారంగా అనిపించటం లేదా? కేవలం భర్తను పోగొట్టుకోవటమే ఆమె చేసిన నేరమా? భార్య చనిపోయిన మూడో గడియకే రెండో పెళ్లికి ఎగబడుతున్నాడే మగాడు. మరి ఆడదానికి రెండో పెళ్లి చెయ్యటానికి మీరెందుకు ముందుకు రాలేకపోతున్నారు? మగాడికి ఆడదానికీ ఈ విషయంలో ఉన్న తేడా ఏమిటి? నన్ను ఈ ఇంట్లో నుండి పంపేయటానికి ఆఖరికి రెండో పెళ్లివాడికిచ్చి చేయటానికైనా సిద్ధపడ్డారే..! అలాగే- అక్క రెండో పెళ్లికి ఎందుకు వెనుకంజ


**రచనలకు ఆహ్వానం**

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరే వారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

sunmagvaartha@gmail.com

వేస్తున్నారు? ఆడపిల్లను ఒకరికి రెండో భార్యగా పంపుతున్నప్పుడు రాని సమస్యలు.. అదే ఆడపిల్లకు రెండో పెళ్లి చేస్తేనే వస్తాయా నాన్నా? ముందు అక్కకు ఒక కొత్త జీవితం ఏర్పాటు చేయండి, ఆ తర్వాత నా పెళ్లి గురించి ఆలోచిద్దురు..” అంటూ చేతిలోని జాతక కాగితాలను ముక్కలు ముక్కలుగా చింపి అవతల పారేసింది ప్రార్థన.

.....

ఆలోచనల నుండి బయటపడి, పెళ్లిపీటల మీద కూర్చున్న వ్యక్తి వైపు చూసింది ప్రార్థన.

అప్రయత్నంగా అతనూ ప్రార్థనను చూశాడు. ఓ క్షణం ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.

అతణ్ణి చూసి ప్రార్థన చిన్నగా నవ్వింది. ప్రార్థననే చూస్తున్న అతని కళ్లు కన్నీటితో నిండిపోయాయి.

“తను ఈ పెళ్లికి అర్హుడేనా? తను ఏం సాధించాడని ఈ పెళ్లి? తన మీదున్న బాధ్యతలన్నీ పక్కన పెట్టి, ఈ పెళ్లిపీటల మీద కూర్చున్నాడే.. తనకు సిగ్గూ, శెరం, మానం ఉన్నాయా? అసలు తనకు వ్యక్తిత్వం అంటూ ఒకటుందా? తల తాకట్టు పెట్టయినా సరే చేయవలసిన పెళ్లిని గాలికొదిలేసి ఎవర్ని ఉద్ధరిద్దామని తనకీ పెళ్లి? తను ఇందుకు మస్మతించటమే తన చేతకానితనాన్ని తెలియజేయటం లేదూ? దీనికంతటికీ కారణం వాడు, పెద్దోడు రాహుల్ కాదూ? మిలట్రీ నుండి రావటం రావటం, తనకు షష్ఠిపూర్తి వివాహం చేసితీరాలని ఒకటే పట్టుపట్టాడు. ఈ కార్యక్రమం వాడి జీవితంలో ఓ మరపురాని స్మృతిగా మిగలాలిట. పైగా చిన్నోడు గోకుల్ అంటాడూ– “మీకు అమ్మాయిని వేరుగా చూడాల్సి పన్లేదు. పెళ్లిచూపులూ, కట్నకానుకలూ అసలు ఈ గోలంతా ఏమీ లేవు నాన్నా. ఈ తంతు జరిపించటం మాకెంతో గౌరవం” అంటాడా?

ఉన్నట్టుండి మంగళ వాయిద్యాల శబ్దం మోగటంతో చేతిలోని అక్షతల్ని అమ్మా–నాన్నల మీదకు విసిరింది ప్రార్థన.

తను వేసిన ‘అక్షంతలు’ నాన్నకు తగిలివుంటాయా? వాళ్లనే చూస్తూ అనుకుంది ప్రార్థన.

“ఎంత బాగా చెప్పింది ప్రార్థన.. నిజమే! ఇకమీదట పెద్దమ్మాయిని నలుగురిలోనూ కలిసి తిరిగేటట్టు చూడాలి. అందరితో పాటు పెళ్లిళ్లకూ, పబ్బాలకూ తీసుకెళ్లాలి. ఇతరులతో పరిచయాలు కలిగేటట్టు అవకాశం కల్పించాలి. ఎవరో ఒకరితో అమ్మాయి మనసు కలపకపోదు. ఒకసారి మనసంటూ కలిసిందంటే అమ్మాయి గతం వాళ్ల పెళ్లికి అడ్డు కాదేమో?! ఇద్దరు కొడుకులున్నారన్న మాటేగానీ, వాళ్లకూ, తనకూ రాని ఆలోచన ప్రార్థనకు రావటం గొప్ప విషయం. తను పెద్ద అమ్మాయి జీవితానికి కచ్చితంగా ఒక బాట ఏర్పరచాలి. ఈ సంప్రదాయాలను కొద్దికొద్దిగా మార్చాలి. ఈ మార్పు తను ఒక్క కూతురి కోసమే కాదు, తన కూతురు లాంటి మరెందరో అభాగినుల కోసం కూడా..” ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చిన వాసుదేవరావ్ మనసు తేలిక పడడంతో పెళ్లి పీటల మీద కూర్చున్న అతను గర్వంగా తలెత్తి కూతురు ముఖంలోకి చూశాడు. ❑


---

**అంతర్జాలంలోని ఆకాశరామన్నలను అడ్డుకునేది ఎవరు?**

**(15వ పేజీ తరువాయి)**

ఈ ఆకాశ రామన్నలు తారస పడుతూనే ఉంటారు. అనేక రాజకీయ పార్టీలకు పెద్ద ఎత్తున చందాలు ఇచ్చే ఆకాశ రామన్నలు నేడు ఎంతో మంది ఉన్నారు. ఈ ఆకాశ రామన్నలందరూ అవినీతి వ్యాపారాల ద్వారా, హవాలా ద్వారా, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాల ద్వారా డబ్బు సంపాదించి రాజకీయ పార్టీలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. వీరిచ్చే చందాలు వేటికీ కూడా ఎటువంటి లెక్కలుగానీ ఆధారాలుగానీ సమాచారంగానీ ఉండదు.

రాజకీయ పార్టీలు చందాల రూపంలో తాము వసూలు చేసే ప్రతి పైసాకు లెక్క చెప్పాలని ఓ అమాయకుడు కోర్టులో కేసు వేసినా అది ఇంతవరకూ అతీ గతీ లేదు. ఇటువంటి అనామకుల చందాల వల్ల సమాజంలో అవినీతి పెరిగిపోవడమే కాకుండా చందాలు ఇచ్చేవారి చేతుల్లో రాజకీయ నాయకులు కీలుబొమ్మలుగా మారి తీసుకునే విధానాలన్నీ వారికి అనుగుణంగా మారిపోతాయనటంలో ఏ సందేహం లేదు. ఇటీవల ఓటుహక్కు ఉన్న వారందరినీ ఆధార్ కార్డుతో అనుసంధానం జరపాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఇదేగనక జరిగితే ఎన్నికలలో దొంగ ఓట్లు లేకుండా పోతాయి. ఎన్నికలు జరిగేటప్పుడు రిగ్గింగుల ద్వారా మూకుమ్మడిగా ఆకాశ రామన్నలు తమకు నచ్చిన పార్టీలకు గంపగుత్తగా ఆర్జించి పెట్టడం మన దేశ రాజకీయాల్లో పరిపాటిగా మారింది. ఆధార్ కార్డుతో అనుసంధానం జరిగితే ఇకమీదట ఇటువంటి అనైతిక కార్యక్రమాలకు అవకాశం ఉండదు. ఏది ఏమైనా సమాజంలో కానీ సామాజిక మాధ్యమాల్లో కానీ ముసుగులు వేసుకుని చీకటిపనులు చేసే ఆకాశ రామన్నల కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయగలిగితే పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయనటంలో ఎటువంటి సందేహం లేదు. ■






ప్రాచీనాంధ్ర వాఙ్మయంలోను, తరువాతి ఆధునిక, నవ్య, అధునాతన వివిధ దశలలో కాలానుగుణంగా కవయిత్రులు, రచయిత్రులు అన్ని ప్రక్రిలలో లబ్ధ ప్రతిష్ఠత సాధించిన చరిత్ర ఎంతో ఉంది. సంస్కృతాంధ్ర సాహితీ గగనంలో, ఎందరో మహిళలు అపార పాండితీ వైభవంతో పురుషులకు దీటుగా కావ్య, ప్రబంధ వివిధ ప్రక్రియలలో ధృవతారలుగా విలసిల్లారు. మొల్ల రామాయణం విశేష ప్రాచుర్యం పొందినా, అంతకు పూర్వం, తరువాతి కాలంలో కూడా ఎందరో కవయిత్రులు అజ్ఞాతంగా కనుమరుగయ్యారు. దక్షిణాంధ్ర వాఙ్మయంలో, తంజావూరు నాయక రాజులలో నాయకమణి రఘునాథరాయల రంగాజమ్మ, ముద్దుపళని వంటి మహిళలు కొందరు ఆస్థాన గౌరవార్హతలు పొందారు. దక్షిణాంధ్ర యుగంలో తదనంతర శహాజీ (1684-1712) రాజ్య కాలంలోని యక్షగానాలలో పౌరాణిక ప్రతిపత్తి తగ్గి, ఆలయ కళ్యాణ మహోత్సవాలలో పురాణ దంపతులకు పాలక రాజులు పెండ్లి పెద్దలుగా విపరీత శృంగార రీతులు ప్రత్యేక లక్షణంగా దేవదాసీ నృత్య, గాన, సంగీత విశేషాలు ప్రవేశించాయి.

కృష్ణదేవరాయల కాలం నాటికి, శృంగార కవిత్వానికి ప్రాధాన్యం పెరిగింది. దక్షిణాంధ్ర రాజుల సభా భవనాలలో అది జుగుప్సా క రంగా పరిణమించింది. ముద్దుపళని(1740-1762) రచించిన సహజమైన ధోరణిలో, అత్యంత సాహసికంగా వెరపులేని స్వేచ్ఛతో కాలానికి ఎదురీది 'రాధికా స్వాంతనం' సృష్టించింది. కాలగర్భంలో కనుమరుగు అవవలసిన ఆ కావ్యం 1887లో సి.పి.బ్రౌన్, తరువాత 1907లో వెంకటనరసు ఈ కావ్యాన్ని ప్రచురించి సజీవం చేసారు. 200 సంవత్స రాల నాటి ఆ రచనను తొలి తెలుగు వైతాళిక మహనీయ సంస్కర్త కందుకూరి, 1887లో తాను ప్రచురించి సమీకరణల సంపుటిలో రాధికా స్వాంతనంలోని సంస్కృ తాంధ్ర మిళితమైన భాషా వైదుష్యాన్ని ప్రశంసించినా, అశ్లీలతా సంబంధిత ప్రధాన ఇతివృత్తాన్ని అంగీకరించలేదు. మద్రాస్ విశ్వవిద్యాలయానికి తెలుగు పాఠ్యాంశ

# తొలి స్త్రీ వాద సాహస కవయిత్రి 'ముద్దుపళని'

సాహిత్యం



కాలంలో రామభద్రాంబ, మధురవాణి సంస్కృతాంధ్ర కవయిత్రులుగా ఆస్థానంలో వుండేవారు. కానీ వీరి తెలుగు గ్రంథాలు వెలుగు చూడలేదు. 'రఘునాథాభ్యుదయం' అనే యక్షగానాన్ని బట్టి వీరిద్దరు ఆశుకవితా ప్రావీణ్యులు, సమస్య పూరణ సమర్థులని కవనశక్తి గలవారని తెలుస్తోంది. ఆ కాలంలోనే పసుపులేటి రంగాజమ్మ 'మన్నారుదాస విలాసం', 'ఉషా పరిణయం' వంటి ప్రబంధాలు రచించారు. యక్షగానం అయిన 'మన్నారుదాస విలాసం' ప్రసిద్ధి పొందింది. కవితాకన్య రాజులకు పరిచారిక అయిన కాలం కాబట్టి రాజుల ముచ్చట్లు ఉండేవి. దైవభక్తి, రాజ విధేయత పేరిట శృంగారం శివమెత్తేది.

### ముద్దుపళని

దక్షిణాంధ్ర సాహిత్యంలో కొట్టవచ్చినట్లు కనపడే కొన్ని లక్షణాలున్నాయి. దేవదాసీల సంప్రదాయ జీవన రీతుల సమాజం కారణంగా, వేశ్యలకు నాటి సమాజంలోను, రాజాస్థానాలలో ప్రాధాన్యత లభించేది. అది క్రమేపీ గౌరవనీయమైన కులంగా భావించబడేది. క్రీ.శ.3వ శతబ్దాంనాటి శూద్రకుని సంస్కృత నాటకం 'మృచ్ఛకటిక' లో (మట్టిబంపి) వసంతసేన అతి సంపన్నురాలైన వేశ్యగా చిత్రించబడిన కథనం, దక్షిణాదిన కూడా క్రమేపీ నెలకొన్న ట్టు ఒక ఆధారంగా భావించవచ్చు. క్రమేపీ వేశ్యలు, మహాపండితులై, మేధావంతులై, దక్షిణాంధ్ర సాహిత్యంలో అపూర్వ కావ్యాలు రచించారు. రామభద్రాంబ, మధురవాణి, 'రాధికా సాంత్వనం', ఇళాదేవి సమర్థ ఎత్తుగడగా కథ ప్రారంభమై, ఆ బాలికను శ్రీకృష్ణుని దగ్గరకు పంపిస్తూ రాధ చేసిన బోధగా, ఒక రాసక్రీడా రణరంగం, తర్వాత అదే కథనంలో విప్రలంభశృంగా రంగా వెర్రితలలు వేసింది. అటువంటి అశ్లీల వర్ణనలకు, కవితా ప్రతిభ ఎంత అద్భుత మైనా, అధిక శృంగారం అనౌచిత్యమై, నాటి పెద్దల తీవ్ర విమర్శనకు గురైంది.

శ్రీకృష్ణుని కొలువు సింగారం ఆనాటి రాజుల పద్ధతి. కవిత్వం అల్లిన జాణలు, రాజులు, సంపన్నుల పోషణలో గౌరవం పొందేవారు. వేశ్యావృత్తికి సంబంధమైన శాసనాలు రాజులు చేసేవారు. ఆ శాసనాలు ఉల్లంఘించిన వేశ్యలకు, విటులకు ఘోర శిక్షలుండేవి. అన్ని కులాలలో వ్యభిచారం రహస్యంగానో, బహిరంగంగానో సాగుతున్న రోజులవి. ధూర్జటి, శ్రీనాథుడు, జగ్గకవి, శ్రీహర్షుడు వంటివారు శృంగార పరంగా కొంత వర్ణనలు చేసినా, ముద్దుపళని రాధికా సాంత్వనం, శృతి మించిన కావ్యంగా పూర్తి అశ్లీలమయమైంది. ఆ విషయమై 'కవుల చరిత్రలో' కందుకూరి వీరేశలింగం, తదనంతరం సహేతుకంగా ఆ కావ్యాన్ని విమర్శించారు. 1739-1763 నాడు మరాఠా రాజ్యాధిపతి ప్రతాపసింహుని ఉంపుడుగత్తెగా వున్న ముద్దుపళని, గొప్ప విదుషీమణి అనడంలో సందేహం లేదు. కానీ రసిక కళా ప్రవీణత కలిగిన శృంగార కవయిత్రి కావడంతో ఆ రోజులలో ఎంపికను ఆయన సిఫార్సు కూడా చేయలేదు. అశ్లీల సాహిత్యంగా ప్రప్రథమంగా బ్రిటిష్ ప్రభుత్వం కూడా నిషేధించింది. 1912 జులై 4 నాటి బ్రిటిష్ ప్రభుత్వ నిషేధపు ఉత్తర్వు స్వాంత్ర్యానంతరం 1947-48లో మద్రాస్ ప్రభుత్వం రద్దు చేసింది. అంతకు ముందు, ప్రతిని కర్నాటక సంగీత విదుషీ మణి బెంగళూరు నాగరతమ్మ, తప్పులను సరిదిద్ది 1910లోనే కొత్త ప్రచురణ వెలువరించారు. సాంత్వనం అంటే మనస్సును అనునయించడం. వేదన నుండి విముక్తి పొందడమే సాంత్వనం. సంగీత సాహిత్య విద్వన్మణి ముద్దుపళని తన శృంగార పద్య ప్రబంధాన్ని దక్షిణ నాయకుడు, మన్మథ శృంగారమూర్తి శ్రీకృష్ణునికి అంకితం యిచ్చింది. రెండు పాత్రలు స్వైర విహార ధీరలైన నెరజాణలు. శృంగారం మితిమీ రినా, కావ్యం శృంగార ప్రధానం కాబట్టి ఆక్షేపించవలసిన అవసరం లేదని 1957లో గోలకొండ పత్రికలో 'ముద్దుపళని-రాధిక' వ్యాసంలో ప్రముఖ సాహితీవేత్త డా॥ దేవులపల్లి రామానుజరావు పేర్కొన్నారు. లలితమైన శైలి, సుకుమార భావాలు, యేర్చి కూర్చిన సుందర శబ్దాలు, తెలుగు జనం నాలుకల మీద నర్తించే సామెతలు, అర్థ గర్భితమైన తెలుగు పలుకుబడులు కవయిత్రి ఎంతో రమ్యంగా ఈ పద్యకావ్యం సృష్టించారు. ముద్దుపళనిని తెలుగులో ప్రప్రథమ స్త్రీవాద రచయిత్రిగా భావించవచ్చు.

**- జయసూర్య**

# తులసి

**తంగెళ్లపల్లి కనకాచారి**

"తులసీ.. నేను ఖైరతాబాద్‌లో రఘునందన్ ఇంటికి పోతున్నా, వస్తావా?" తులసీవాళ్ల హాస్టల్‌ముందు నిలబడి ఫోన్ చేసాడు వివేకానంద శాస్త్రి.

"నాకు కొంచెం పని వుంది.. పుష్ప వస్తానంది.. కంప్యూటర్‌సార్ వాళ్ల ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్లాలి".

"పుష్పని పోనివ్వు.. నువ్వు రా, అంత తొందరేముంది?"

"బైటికి వస్తున్నా.. నీ దగ్గర వచ్చాక పుష్పకు ఫోన్ చేస్తాను"

ఇద్దరూ కలిసి పుష్పకు ఫోన్ చేసారు. తనూ రావడం లేదంది.. వాళ్ల అమ్మతో కలిసి షాపింగ్‌కు వెళ్తుందని చెప్పింది.

వివేకానంద శాస్త్రి, తులసి కలిసి ఖైరతాబాద్ వెళ్లారు. అక్కడ వీళ్ల క్లాస్‌మేట్ రఘునందన్‌ను కలిసి వచ్చారు. బస్తీలో వెంకటేశ్వర స్వామి గుడిపూజారి రఘునందన్ నాన్న. వీళ్లది వివేకానంద ఊరే.

"పుష్ప రాలేదా? కంప్యూటర్ క్లాస్‌కు వస్తానంది. ఫోన్ చేస్తే ఫోన్ ఎత్తలేదు. సార్ అడిగాడు రాలేదని. వివేకానంద నువ్వు క్లాసెస్‌కు ఎందుకు రావడం లేదని సార్ అడిగాడు. ఈ మధ్య తిరుగుళ్లు ఎక్కువ అయ్యాయని కామెంట్ చేసాడు" రఘునందన్ అన్నాడు నవ్వుతూ.



"సార్లు అంతే అంటార్లేరా. వాళ్లు కాలేజీ టైంలో బుద్ధిగా ఉన్నారా? అవునా తులసీ" నవ్వుతున్నాడు వివేకానంద.

"వివేకానందుడు శ్రీకృష్ణుడయ్యాడని లోకం కోడైకూస్తుంది. నాకూ విన్పిస్తున్నాయి బృందావనంలో గోపికల కామెంట్లు" కోపంగా అంది తులసి బుంగమూతి పెట్టి.

"తులసీ! ఏమిటా కోపం? నేనేంటో నీకు తెలుసుగా.. రఘునందన్ ఎందుకురా రెచ్చగొడ్తావు? పుష్పకు చెబుతా" అన్నాడు నవ్వుతూ.

"చెప్పు.. చెప్పు ఎప్పుడు బ్రేక్ అవుతుందా? అని చూస్తున్నా. స్టడీపై కాన్‌సన్‌ట్రేషన్ కావడం లేదు. పుష్ప బాగా సతాయిస్తుందిరా".

బాగుంది.. మీరేమో బుద్ధిమంతులు, అమ్మాయిలమేమో సతాయించేవాళ్లమా?" కోపంగా రఘునందన్‌పై విరుచుకుపడింది తులసి.

"వద్దు.. వద్దు మహాతల్లీ! మీ అమ్మాయిలనేమీ అనములే" సరదాగా చెంపలు కొట్టుకుంటూ సారీ చెప్పాడు.. అందరూ గట్టిగా నవ్వుకున్నారు. వీరంతా ఒకే కాలేజీ క్లాస్‌మేట్స్ కూడానూ.

...

కాలేజీ క్యాంపస్ బైట టీ స్టాల్ దగ్గర టీ తాగుతూ కూర్చున్నారు రఘునందన్, వివేకానంద.

"రఘునందన్! నేను రేపు, ఎల్లుండి కాలేజీకి రావడం లేదు. ఏదో పనుండి ఊరెళ్లాడని చెప్పు తులసికి.

"ఏం పనిరా? ఆ నందిని రమ్మందా? చూస్తున్నా. ఈ మధ్య నందినితో ముచ్చట్లు ఎక్కువయ్యాయి"

"అదేంకాదురా... రమ్మంది అందుకే"

"ఏరా, ఈ తిరుగుళ్లు ఆపురా. తులసికి తెలిస్తే బాగోదు .. నీపై ఆశలు పెట్టుకుంది"

"తులసీ.. తులసీ... పొద్దాక చెప్పుకురా. తులసిని కాదన్నానా" విసుక్కున్నాడు వివేకానంద.

"సరే చెప్తారా బాబు? మధ్యలో నేనొకడ్ని.. మీకు అయినా అదిగో తులసి వస్తోంది నువ్వే చెప్పు నేను పోతున్నా" కాస్త కోపంగానే అన్నాడు రఘునందన్. "అరే ఉండరా బాబు.. మధ్యలో జంప్ అయితే మళ్లీ లొల్లి" బతిమిలాడాడు వివేకానంద.

"నాకూ టీ చెబుతారా.. నా టీ నేను తాగాలా?" అంది వస్తూనే తులసి.

"మామూలు టీ కాదు, స్పెషల్ టీ చెబుతాం" నవ్వుతూ అన్నాడు వివేకానంద.

"ఏమిటీ? తేలు కుట్టిన దొంగల్లా గుసగుసలు" టీ తాగుతూ అంది తులసి.

"ఏంలేదు అమ్మాయిగారు! కంప్యూటర్స్ లో ఫస్ట్ ర్యాంక్ వచ్చిందట.. కంగ్రాట్స్" షేక్ హాండ్ ఇవ్వబోయాడు వివేకానంద.

"నీ షేక్ హ్యాండ్‌లు వద్దుకానీ హ్యాండ్ ఇవ్వకుంటే చాలు. తమరు క్లాస్‌కు రాలేదు ఎందుకో నీ అటెండెన్స్ తక్కువగా ఉంటుంది. ప్రిన్సిపాల్ ఇంటికి ఫోన్ చేసాడు. తరువాత నీ ఇష్టం".

"తులసీ! కాలేజీకి రాగానే ప్రిన్సిపాల్ పొద్దునే వివేకానందకు క్లాస్ పీకాడు. అందుకే కోపంతో మరీ క్లాస్ దుమ్మా కొట్టాడు".

"అక్షంతలు పడ్డాయా.. తెలియదు" అంది తులసి.

"అరే ఇలా మీరు సతాయిస్తే నేను అసలు మీతో మాట్లాడను. అయినా తులసీ రెండు రోజులు నేను మా ఊరు వెళ్తున్నా. మా స్కూల్ క్లాస్‌మేట్‌ది పెళ్లి" అని చెప్పి "ఒకే" అంటూ చెప్పి అక్కడినుంచి కోపంగా వెళ్లిపోయాడు వివేకానంద.

.....

"ఏయ్ రఘునందన్! అర్జెంట్‌గా రేపు మనం తులసీవాళ్ల ఊరు పోవాలి" హడావుడిగా ఫోన్ చేసింది పుష్ప.

"ఎందుకే అంత హడావుడీ?" ఆసక్తిగా అడిగాడు. "నీకో శుభవార్త చెప్పాలి. డిగ్రీ అయిపోయింది. ఎమ్మెస్సీలో జాయిన్ అయ్యాం, అదీ పూర్తవుతుంది"

"తెలిసిన విషయాలు ఎందుకు చెబుతున్నావు? పేపర్ చదువుతున్నా కాసేపు ఆగి చేయి" "పేపర్ చదువుదువుగానీ.. తులసి ఫోన్ చేసింది, నీకు చెప్పమంది తులసి నిశ్చితార్థ మంట.. వివేకానందతోనే. అనుకున్న వెంటనే రెండు ఫ్యామిలీలు ఈ సంబంధాన్ని ఒప్పుకున్నాయంట".

"ఓహో..! మంచిదే శుభవార్త.. శుభమస్తు.. మొత్తానికి కళ్లెం గట్టిగానే పట్టుకుంది తులసి.. లేకుంటే వివేకానంద ఏమైతాడో అనుకున్నాం. చదువును గాడిలో పెట్టించింది, బుద్ధిగా చదివేలా చేసింది. నిజంగా వాడికి సరైన జోడి తులసినే"

"అవును రఘునందన్. తమరేమీ తక్కువ కాదులే. కానీ నీతులు చెప్పకు. మరి మన పెళ్లి ఎప్పుడు?" అంది నవ్వుతూ.

"అమ్మాయిగారు ఎప్పుడంటే అప్పుడే ఇప్పుడే ఈ క్షణమే గాంధర్వ వివాహం చేసుకుందామా?" అని గట్టిగా నవ్వాడు.

పుష్ప నవ్వులో శృతి కలిపింది. ❑

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458



# యజమాని కూర్చోనడానికి అనువైన స్థలం?

**తూర్పు** ముఖద్వార దుకాణాల్లో యజమాని కూర్చోవడానికి అనువయిన స్థలాలు నైరుతి, ఆగ్నేయాలు.
దుకాణానికి తూర్పున రోడ్డు వున్నప్పుడు సహజంగా ఆ దుకాణం తూర్పు ముఖ ద్వార దుకాణం అవుతుంది.
దుకాణానికి ముఖ ద్వారం దగ్గర కూర్చోవడం అవసరమయిన వ్యాపారం అయితే ఆ దుకాణంలో ఆగ్నేయ భాగంలో యజమాని కూర్చోవాలి.
ఈశాన్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ కూర్చోకూడదు.
ఆగ్నేయంలో తూర్పు ముఖ ద్వారాన్ని అంటకుండా ఉత్తరానికి అభిముఖంగా దక్షిణ గోడను తాకి కూర్చునేలా కుర్చీ ఏర్పాటు చేసుకోవాలి. ఆగ్నేయం తూర్పున గ్లాస్ పార్టిషన్‌గానీ, గోడగానీ వున్న వుంటే ఆ పార్టిషన్‌నిగానీ, గోడనుగానీ తాకకుండా ఒకటి నుండి మూడు అడుగుల లోపు స్థలాన్ని వదిలి దక్షిణ ఆగ్నేయపు గోడను ఆనుకుని కూర్చోవాలి.
కొన్ని దుకాణాల్లో ఇదే స్థలంలో కూర్చున్నప్పటికీ లోపల పనివాళ్ల మీద నిగరాని చేస్తూ పశ్చిమానికి అభిముఖంగా కూర్చుంటారు. అది సరైంది కాదు. గల్లాపెట్టెను తనకు ఎడమ వైపుకు పెట్టుకుని ఉత్తరాభిముఖంగా కూర్చోవాలి.
ఒకవేళ తూర్పుకే ముఖం చేసి కూర్చోవాల్సిన అవసరం వస్తే గల్లాపెట్టెను తనకు కుడివైపు అమర్చుకోవాలి. అరుగు కట్టుకొని కూర్చోకూడదు. కింద కూర్చోవచ్చు లేదా టేబుల్, చైర్ వేసుకొని కూర్చోవచ్చు.
అదే ముఖద్వారం వున్న దుకాణంలో యజమాని షాపులోపలి వైపు కూర్చోవలసి వస్తే నైరుతి భాగంలోనే కూర్చోవాలి. వాయువ్యం వైపు కూర్చోకూడదు.
నైరుతి స్థానంలో కింద కూర్చోవలసి వస్తే అరుగులు నిర్మించుకుని పైన కూర్చోవచ్చు. కింద కూర్చోకూడదు. చైర్, టేబుల్ వేసుకుని కూర్చోవచ్చు.
ఉత్తరాభిముఖంగా కానీ, తూర్పుకు అభిముఖంగా కానీ కూర్చోవాలి. మరో దిక్కుకు అభిముఖంగా కూర్చోవడం సరైన పద్ధతి కాదు.
నైరుతిలో ఉత్తరాభిముఖంగా కూర్చుంటే గల్లాపెట్టెను తన ఎడమ చేతి వైపుకు, తూర్పుకు అభిముఖంగా కూర్చుంటే గల్లా పెట్టెను తన కుడిచేతి వైపుకు వుంచేలా అమర్చుకోవాలి.

### నైరుతిలో తూర్పుకు అభిముఖంగా కూర్చునే విధానం

నైరుతిలోగానీ, ఆగ్నేయంలోగానీ కూర్చునే దుకాణ యజమానులు తమ వెనుక గోడ మీద దేవుని పటాలు పెట్టి పూజించడం సాధారణంగా జరుగుతుంటుంది.
ఏ దుకాణంలోనైనా ఈశాన్యమే పూజకు ప్రధానమైన, శ్రేష్ఠమైన స్థలం. తూర్పు ముఖద్వార దుకాణంలో తూర్పు ఈశాన్యం ముఖ ద్వారానికి ఆనుకొనే ఉంటుంది. అక్కడ తూర్పున తెరిచి ఉంటుంది. కనుక పూజ కోసం పటాలు పెట్టడం వీలు కుదరకనప్పుడు ఉత్తర ఈశాన్యంలో దేవుని పటాలు పెట్టి దీపారాధన చేయాలి. యజమాని తాను కూర్చున్న చోట గోడకు దేవుని పటాలు పెట్టుకోవచ్చు. కానీ ప్రతిరోజూ మొదటి పూజ ఈశాన్యంలో చేసిన తర్వాతే తను కూర్చున్న స్థలంలో ఏర్పరచుకొన్న పటాలకు పూజ చేయడం మంచిది.


### షట్టర్స్

తూర్పున ఒకటికన్నా ఎక్కువ షట్టర్స్ ఉంటే ఉదయం దుకాణం తెరిచేటప్పుడు మొదట ఈశాన్యం వైపున వున్న షట్టర్ ఒకటిని తెరవాలి. ఆ తర్వాతే తూర్పు, ఆగ్నేయాలలో(2,3) వున్న షట్టర్స్‌ని క్రమంగా తెరవాలి. దుకాణాన్ని రాత్రి మూసివేసే సమయాల్లో మొదట ఆగ్నేయ భాగంలో వున్న షట్టర్‌ని (3) మూసివేయాలి. ఆ తర్వాతనే తూర్పు, ఈశాన్యాలలో వున్న షట్టర్‌ని (2,1) క్రమంగా మూసివేయాలి.
తూర్పు ముఖ దుకాణాలకు మెట్లు తూర్పుకు వుంటాయి. మెట్లు షాపు నిడివిని పూర్తిగా కవర్ చేస్తూ వుండవచ్చు. కానీ తూర్పు ఆగ్నేయం వైపున మెట్లు వుండి తూర్పు ఈశాన్యం వైపు మెట్లు లేకుండా వుండటం తప్పు.
తూర్పున వున్న వీధి వైపు పూర్తిగా విస్తరించిగానీ తూర్పు ఈశాన్యాన్ని కవర్ చేస్తూగానీ, మెట్ల నిర్మాణం వుండాలి. వచ్చిపోయే కస్టమర్స్ నడక తూర్పు ఈశాన్యం నుండి జరగడం వల్ల వ్యాపారం అభివృద్ధి చెందుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.



# టిప్పుసుల్తాన్ కలలు






అది నిజమే.
పుస్తకాలతో ఏర్పడిన పరిచయాలు భలే పసందుగా ఉంటాయి.
కలకత్తా వెళ్తున్నప్పుడు అక్కడి కాలేజీ రోడ్డులో ఉన్న పాత పుస్తకాలమ్మే ఓ దుకాణాన్ని తప్పక సందర్శించి వస్తుంటాడు మిత్రుడు ఎస్.రామకృష్ణన్. ఆ దుకాణంలో అరుదైన పాత పుస్తకాలు అనేకం ఉంటాయి.
కాలేజీ రోడ్డులో వున్న కాఫీ హౌసులు ఎంతో ప్రసిద్ధమైనవి. సాహితీవేత్తలు, సినిమా దర్శకులు, ప్రొఫెసర్లు, ఆలోచనాపరులు అంటూ వివిధ రంగాలకు చెందినవారు కలిసి మాట్లాడుకునే నిలయమై విలసిల్లుతుం టాయా కాఫీ హౌసులు.
ప్రస్తుతం అక్కడ ఎన్నో మార్పులు చోటు చేసుకున్నప్పటికీ ఇండియన్ కాఫీ హౌసులో సాహిత్యం గురించి మాట్లాడేవారు కనిపిస్తూనే ఉంటారన్నారు రామకృష్ణన్.
భారత జాతీయ గ్రంథాలయం కలకత్తాలోనే ఉంది. దీనిని నిర్వహించేది భారత ప్రభుత్వమే. అది పెద్ద గ్రంథాలయం. ముప్పై ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ గ్రంథాలయంలో ఇరవై రెండు లక్షలకు పైగా పుస్తకాలు ఉన్నాయి.
భారతీయ భాషలలో విడుదలైన అన్ని పుస్తకాలు ఇక్కడ ఉంటాయి. 1963లో ఈ గ్రంథాలయంలో తమిళ పుస్తకాల విభాగం ఏర్పాటైంది. అరుదైన తాళపత్ర గ్రంథాలు ఉన్నాయి. ప్రస్తుతం అరవై వేల తమిళ పుస్తకాలు, మూడు వందలకు పైగా తాళపత్ర ప్రతులు ఇక్కడ ఉన్నాయి.
కలకత్తాకు వెళ్లేవారు తప్పక చూడవలసిన గ్రంథాలయమిది.
పేరుకు తగినట్టే కలకత్తాలోని కాలేజీ రోడ్డులో అనేక విద్యాలయాలు ఉన్నాయి. కనుక ఇక్కడి పాత పుస్తకాల దుకాణంలో అన్ని రకాల పుస్తకాలు లభిస్తాయి. కానీ వాటిని వెతికే ఓపిక మనకుండాలి. ఇక్కడే నా మిత్రుడు తమిళంలో టిప్పుసుల్తాన్ కలలు.. అనే పుస్తకాన్ని కొనుక్కొచ్చారు. దానిని ఆయన కొంటున్నప్పుడు అది నవల అనుకున్నారట. కానీ తిరగేస్తే టిప్పుసుల్తాన్ తన కలలను తానే నమోదు చేసారని తెలియడంతోనే దానిని తుదిదాకా చదవాలన్న ఆసక్తి ఆయనకు కలిగింది.

.....

మైసూరు టైగర్ అని పిలువబడిన టిప్పుసుల్తాన్ ఈస్టిండియా కంపెనీ అధికారానికి వ్యతిరేకంగా ధ్వజమెత్తినా వారు టిప్పుసుల్తాన్ యవ్వనంలోనే తన తండ్రి హైదర్‌తో కలిసి పలు యుద్ధాల్లో పాల్గొన్నారు. క్రీ.శ.1767లో బ్రిటిష్ దళపతి జోసఫ్ స్మిత్ సారథ్యంలో వచ్చిన బ్రిటిష్ దళాన్ని ఎదుర్కొని విజయం సాధించినప్పుడు టిప్పుసుల్తాన్ వయస్సు కేవలం పదిహేడేళ్లు.
1782 డిసెంబరు 26వ తేదీన తన 32వ ఏట సుల్తానుగా సింహాసనాన్ని అధిష్టించిన టిప్పుసుల్తాన్‌ను ఓడించడం కష్టమని బ్రిటిష్ సైనికులు అనుకున్నారు. దాంతో కుట్ర పన్ని టిప్పు మంత్రులను, అధికారులను లంచంతో తమ గుప్పెట్లో పెట్టుకుని టిప్పుసుల్తాన్ ఆచూకీ చెప్పమని అడిగి పడగొట్టారు బ్రిటిష్ సైనికులు.
టిప్పుసుల్తాన్‌ని ఓడించిన సైనికులు ఆయన కోటలోకి జొరబడి ఒరియంటల్ లైబ్రరీ అనే పేరుతో ఉన్న ఆయన



గ్రంథాలయంలో ఉన్న రెండు వేలకు పైబడిన పుస్తకాలు, రికార్డులను యుద్ధాయుధాలకు సంబంధించిన రికార్డులు, మ్యాపులు, ఇతరత్రా ప్రతులను స్వాధీనం తీసుకున్నారు. ఆ సమయంలోనే టిప్పుసుల్తాన్ పడగ్గదిలో దాచి ఉంచిన ఆయన కలల ప్రతిని స్వాధీనం చేసుకున్నారు. టిప్పుసుల్తాన్ కలల పుస్తకం 1785 నుంచి 1798 వరకు 13 ఏళ్లల్లో ఆయన కన్న కలలన్నీ ఇందులో ఉన్నాయి.
ఇందులో 37 కలలకు సంబంధించి టిప్పు వివరణలు నమోదై ఉన్నాయి. పర్షియన్ భాషలో రాయబడ్డ ఈ కలలను ఇంగ్లీషులో అనువదించారు. టిప్పుసుల్తాన్ పర్షియన్ భాషలో దిట్ట

అని ఈ పుస్తకం వల్ల తెలుస్తోంది.
తన కలలను టిప్పుసుల్తాన్ ఎందుకు రాశారన్నది ఇప్పటికీ పొడుపు కథలాగానే ఉంది. ప్రతి కల జరగబోయే సంఘటనను ముందుగానే చెప్పినట్టు అనుకున్నారు. కలలను నిజం చేసుకోవడం ద్వారా భవిష్యత్తును తాననుకున్నట్టు తీర్చిదిద్దుకోవచ్చని అనుకున్నారు టిప్పుసుల్తాన్. కలలో కనిపించిన దృశ్యాలన్నింటినీ ఆయన ఎంతో జాగ్రత్తగా నమోదు చేసుకున్నారు.
ఓ కలలో మూడు వెండి పళ్లాలలో ఖర్జూరపళ్లు ఉండటం గురించి ఇలా రాసారు.. తన శత్రువులైన నిజాం, మరాఠా, ఈస్టిండియా కంపెనీ ప్రతిరూపాలే ఆ ఖర్జూరాలని అన్నారు.
యుద్ధంలో ప్రత్యర్థులను నేలకూలుస్తున్నట్టు తరచూ ఆయన కలలు కంటుండేవారు.
ఓ ప్రత్యర్థిని ఒక్క కత్తిపోటుతో నేలకూల్చినట్టు ఓసారి కలగన్నారు.
విజయానంతరం టిప్పుసులాన్ విందుకు వెళ్తుండగా అక్కడ తెల్ల గడ్డంలో ఉన్న ఓ వృద్ధుడు ఆయనకు స్వాగతం పలికి తీపి పదార్థాలు తినిపించినట్టు కలగన్నారు. ఆ తీపి పదార్థం ఎలా ఉందంటే– అంతకుముందెన్నడూ ఆయన అటువంటి తీపిని రుచి చూడలేదన్నట్టుగా ఆయన కలగన్నారు. కత్తిని ఒరలో పెట్టుకోవడంతో ఆ కల ముగిసిందట.
మరొక కలలో ఆయనకు ఓ వ్యక్తి అప్పుడే పిండిన పాలని తాగడానికి ఇచ్చినట్టు ఇంకొక కల. తీరా ఆ పాలను తాగుదామనుకున్నప్పుడు ఆ కల కాస్తా చెదిరిపోయిందట.
ఒకసారి చైనా నుంచి దూతలు వచ్చినప్పుడు టిప్పుసుల్తాన్ ఆయనకు స్వాగతం పలికి, వారి రాక గురించి అడిగి తెలుసుకున్నట్టు మరొక కల. ఈ కలలో వారు ఓ శ్వేత ఏనుగుని చైనా రాజు కానుకగా తీసుకొచ్చినట్టు చెప్పారు టిప్పుసుల్తాన్‌తో.
అలెగ్జాండరుకి తర్వాత చైనా రాజు ఇటువంటి అరుదైన కానుక ఇవ్వడం ఇదే మొదటిసారట. ఈ కలలో టిప్పుసుల్తాన్ తాను అడవిలో పట్టుకున్న ఏనుగులను చైనా దూతలకు చూపిస్తుండగా కల చెదరిపోయిందట.
ఇలా టిప్పు కలలు, ఆశలు, ప్రత్యర్థులను గెలవడానికి సమాలోచనలు, సూఫీల ఆశీస్సులు వంటివన్నీ ఈ పుస్తకంలో నమోదయ్యాయి. ఈ పుస్తకాన్ని ఆధారంగా చేసుకుని ప్రముఖ నాటక రచయిత గిరీష్‌కర్నాడ్ ఓ నాటకాన్ని కూడా రాశారు.
అందరూ కలలు కంటాం. కానీ ఎవరి కలలు వారివే.
ఒక కలకు మరొక కలకూ సంబంధం ఉండదు.
కలలు అనేవి రేపటి ప్రశ్నలకు ఈనాటి జవాబులన్నారు ఓ రచయిత. టిప్పు కలలు కూడా ఇలాంటివే సుమా!

**- యామిజాల జగదీశ్**

# కేరళ పాయసాలు

కేరళ వాళ్ల ముఖ్య పాయసం 'పాల పాయసం'. దీనిని పాలతో తయారు చేస్తారు. అన్నప్రాసన, పుట్టినరోజు, దేవాలయాలలో మొక్కుబడిగా ముఖ్యంగా శ్రీకృష్ణుడి దేవాలయాలలో పాల పాయసం చేస్తారు. పాల్ పాయసం ఎంతో రుచిగా, పోషకాలతో కూడి ఉంటుంది. దీనిని చాలా సులభంగా తయారు చేసుకోవచ్చు.

**కావలసిన పదార్థాలు**


చిక్కటి పాలు – 2 లీటర్లు
నీళ్లు – 1 లీటరు
బియ్యం – 200 గ్రాములు
నేయి – 50 మి.గ్రా.
జీడిపప్పు, కిస్‌మిస్ – పెద్ద స్పూను
ఏలకుల పొడి – చిన్న స్పూను

**తయారు చేసే విధానం**

పాలు బాగా మరగపెట్టి పసుపు రంగులోకి మరీ చిక్కగా అవ్వాలి. ఇందులో కడిగిన బియ్యం వేసి సన్నని మంట మీద ఉడకబెట్టాలి. అడుగు పట్టకుండా చూడాలి, అవసరమైతే కొద్దిగా నీళ్లు



పోయాలి. బియ్యం బాగా ఉడికిన తరువాత పంచదార వేసి కలుపుతూ నేయి వేయాలి.
ఇందులోకి నెయ్యిలో వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ పలుకులు వేయాలి.



**చెరుపయర్ పాయసం**
**(పెసరపప్పు పాయసం)**

కేరళలో పెసరపప్పు పాయసం చాలా ఇష్టంగా చేసుకుంటారు.

**కావలసిన పదార్థాలు**

పెసరపప్పు – 250 గ్రామాలు
బెల్లం – 350 గ్రాములు
నేయి – 100 మి.గ్రా.
కొబ్బరికాయలు – 3
జీడిపప్పు – పెద్ద స్పూను
కిస్‌మిస్ – చిన్న స్పూను
చిన్న కొబ్బరిముక్కలు – పెద్ద స్పూన్
ఏలకుల పొడి – చిన్న స్పూను

**తయారు చేసే విధానం**

బెల్లం కరిగించి తీగపాకం చేయాలి. కొంచెం నెయ్యిలో పెసరపప్పుని వేయించి కొంచెం నీటిలో ఉడకపెట్టాలి. కొబ్బరి తురిమి మొదటి పాలు మూడు కప్పులు రెండవ పాలు ఆరు కప్పులు తీయాలి. ఉడికిన పెసరపప్పులోకి తీగపాకం పోసి కలపాలి, మధ్య మధ్యలో నెయ్యి వేస్తుండాలి. ఇది బాగా దగ్గరైన తరువాత ఆరు కప్పుల కొబ్బరిపాలు పోసి మరగపెట్టాలి.
ఇందులోకి మూడు కప్పుల కొబ్బరి పాలు పోసి కలిపి దించాలి. మిగతా నెయ్యిలో జీడి పప్పు, కిస్‌మిస్ వేయించి పాయసంలో కలపాలి. చివరిగా పాయసంలో ఏలకుల పొడి వేసిత వేడి వేడిగా పాయసం ఆరగించవచ్చు. ఈ పాయసం ఆరోగ్యానికి ఎంతో మంచిది.

**- ఈఎస్ మాధవన్**





# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



వృత్తి వ్యాపారస్తులకు సామాన్యంగా ఉంటుంది. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. సంతానా భివృద్ధి సంతృప్తినిస్తుంది. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. స్త్రీలకు శుభ యోగం. విలువైన వస్త్రాభ రణాలు కొనుగోలు. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. దేశాంతర ప్రయాణం లాభిస్తుంది.

## వృషభం



రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి బాగుంటుంది. అకారణంగా మానసిక సంఘర్షణకు లోనవుతారు. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. విందు-వినోదాల్లో పాల్గొం టాయి. సామాన్య ధన లాభాలుంటాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. గతంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభి స్తారు. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఫలిస్తాయి.

## మిథునం



ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొం టారు. అనాథలకు ఆశ్రయం కల్పిస్తారు. దీర్ఘకాలిక సమ స్యలకు పరిష్కారం లభిస్తుంది. వృధా సంచారం చేస్తారు. సహోద్యోగులతో సఖ్యత ఏర్పడుతుంది. విద్యార్థులకు శుభయోగం. శుభ కార్యాల్లో పాల్గొంటారు. కొత్త విషయాలు తెలుసుకోవాలన్న ఉత్సుకత ఏర్పడుతుంది. కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి.

## కర్కాటం



ఎదురు చూస్తున్న శుభ వార్తలు వారాంతంలో వింటారు. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరిం చడం చెప్పదగిన సూచన. వృత్తి విద్యా కోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని నిశ్చయించుకుంటారు. శత్రువులు మిత్రుల వుతారు. వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారు. గృహ ప్రాప్తి.

## సింహం



స్త్రీలకు స్థిరాస్తులు కలిసి వస్తాయి. దూర ప్రాంత ప్రయాణం చేస్తారు. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించండి. చోర భయం పొంచి వుంది కనుక విలువైన వస్తు వుల పట్ల జాగ్రత్తలు పాటించండి. కాలానుగుణంగా వ్యాపారం చేసేవారికి ఆశించిన ఫలితాలు ఉంటాయి. అవసరానికి మించిన రుణాలు చేయకపోవడం ఉత్తమం. ఉద్యోగులకు స్థాన చలనం.

## కన్య



కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి, సంయమనం పాటించండి. ముఖ్యమైన పనులు వాయిదా వేయడం మంచిది. వ్యాపారులకు స్వల్ప నష్ట సూచనలున్నాయి. కుటుంబంలో అభిప్రాయ భేదాలు. విందు-వినోదాల్లో పాల్గొంటారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి ఉంటుంది, ఫలితాలు కూడా అలాగే ఉంటాయి.

## తుల



ఆరోగ్య సమస్యలుంటాయి. దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. స్వగృహ ఆలోచనలు వాయిదా వేస్తారు. ఏది జరిగినా మన మంచికే అన్న ధోరణి ఏర్పడుతుంది. అన్ని వ్యవహారాల్లో మీదే విజయం. శుభ కార్యాలకు హాజరవుతారు. ప్రభుత్వ సంబంధ మైన పనులు వారాంతంలో పూర్తి అవుతాయి. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. రుణాలు మంజూరు.

## వృశ్చికం



సామాన్యంగా ఉంటుంది. గృహ సౌఖ్యం. భాగ స్వామ్య వ్యాపారులకు సమస్యలు సానుకూలంగా సమస్యలు పరిష్కారమవుతాయి. ముఖ్యమైన నిర్ణయాలు అమలు. తాహతుకు మించిన రుణాలు చేస్తారు. శక్తి సామర్థ్యాలకు గుర్తింపు లభిస్తుంది. వృత్తి విద్యా కోర్సుల్లో చేరతారు. కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. మిత్రులతో కలిసి తీర్థ యాత్రలు చేస్తారు. వస్తు వుల కొనుగోలు-అమ్మకం వ్యవహారాలు సామాన్యం.

## ధనుస్సు



దేశాంతర ప్రయాణం చేస్తారు. అందరూ మీ మాటే వేదవాక్కులా ఆచరిస్తారు. భాగస్వామ్య వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. పెట్టుబడులు వాయిదా వేయడం మంచిది. అకారణంగా ఆందోళన చెందుతారు. వృత్తి విద్యా కోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. సహోద్యోగులతో సఖ్యత ఏర్పడుతుంది. కుటుంబంలో మనస్పర్థలకు ఆస్కారం. విందు-వినోదాల్లో పాల్గొంటారు. విద్యార్థులకు పోటీ పరీక్షల్లో విజయం.

## మకరం



వ్యవసాయదారులకు బాగుంటుంది. ఉద్యోగులకు పనివత్తిడి అధికం. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. ఎదురు చూస్తున్న శుభ వార్తలు మరింత ఆలస్యంగా అందుకుంటారు. కోర్టు వ్యవహారాలు వాయిదా. పాత బాకీలు అనూహ్యంగా వసూలవుతాయి. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. వృత్తి విద్యాకోర్సులు అభ్యసించిన వారికి బాగుంటుంది. సాహస యాత్రలు చేయాలన్న కోరిక తీరుతుంది.

## కుంభం



సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదాయానికి మించిన ఖర్చులున్నా సమయస్ఫూర్తితో సర్దుబాటు చేసు కుంటారు. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. ఎదురు చూస్తున్న ఉద్యోగం వారాంతంలో లభిస్తుంది. వ్యాపారులు వస్తువుల నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీపడరు. ముఖ్యమైన నిర్ణయాలు అమలు చేస్తారు. భూ తగాదాలు తీరుతాయి.

## మీనం



క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. నూతన వ్యక్తులతో పరిచయం. సామాన్య ధన లాభాలుం టాయి. ధర్మ రక్షణకై పాటుపడతారు. అనుకోని సంఘటనలు జరిగినా ధైర్యంగా ఎదుర్కొంటారు. వ్యాపారులకు పోటీ ఏర్ప డినా ఎవరి లాభాలు వారికుంటాయి. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. ధార్మిక చింతన అలవడుతుంది. మీ ఆలోచనలు ఇతరులకు స్ఫూర్తినిస్తాయి.

# సరదాగా కాసేపు నవ్వుకోండి



### గిన్నిస్ బుక్

రాము: అమ్మా, నేను గిన్నిస్ బుక్ ఎక్కాను.
తల్లి: ఎప్పుడు?
రాము: నిన్న.
తల్లి: ఎలా? ఏం సాధించావు?
రాము: గిన్నె మీద బుక్ పెట్టి ఎక్కాను.
తల్లి: ఆ....

### నీలా..

తాత: సీతా! పెద్దయ్యాక నీవు ఏమవుతావు?
సీత: నేను డాక్టర్ని అవుతాను.
తాత: వెరీగుడ్. శ్రీనూ! నువ్వు?
శ్రీను: నేను ఇంజినీరు అవుతాను.
తాత: వెరీగుడ్. శేఖర్! మరి నువ్వు?
శేఖర్: పెరిగి పెద్దయ్యాక నీలా ముసలివాడిని అవుతాను.
తాత: ఆ.......

**- మా.శ్రీ.రాజు,** పాల్వంచ

### ఆచారం

అప్పారావు: ఏం గోవిందూ! పండక్కి అత్తారింటికి వెళ్లలేదా?
గోవిందు: మా అత్తగారింట్లో ఒక ఆచారం వుందిరా.. పండగ మూడు రోజులూ కొత్త అల్లుడు కళ్లాపి జల్లి, ముగ్గులు పెట్టాలి.
అప్పారావు: ఆ... అంటూ నెరెళ్లబెట్టాడు.

### పుస్తకం

కాంతం: పద్మా! ఈ మధ్య కనిపించ లేదు, అంత బిజీగా వున్నారా?
పద్మ: పుస్తకం చదువుతున్నాను.
కాంతం: ఏం పుస్తకం?
పద్మ: మొగుణ్ణి ఎలా అదుపులో పెట్టాలి? అనే పుస్తకం.

### చల్లటి నీళ్లకోసం

కనకయ్య: ఏం సోములూ! అడుక్కోవడానికి ఎప్పుడూ ఈ వీధికే వస్తావెందుకు?
సోములు: ఈ వీధిలో అందరిళ్లల్లో ఫ్రిజ్‌లు వున్నాయి, చల్లని నీళ్లు తాగొచ్చని.

### హాస్య కవిత

మా ఆవిడ సండే వెన్నెల్లో పుట్టింది
నేను మండే ఎండల్లో పుట్టాను
మా ఆవిడకు కోపం
పెట్రోల్ ధరలా పెరిగిపోయింది
నా సంతోషం రూపాయిలా
పడిపోయింది
పెరిగాయి మా ఇద్దరి మధ్య గొడవలు
మా ఆవిడకిచ్చాను విడాకులు
నా మెడలో వేసింది
మా ఆవిడ
మామిడాకుల దండ
ఇక మా సంసారంలో వచ్చెదనం
మా జీవితం
నవ్వుల సింగారం

**- సంపంగివారి జయచంద్రారెడ్డి,** బాపట్ల

### నాకూ అదే బాధ!

పద్మ: సుశీ! కాలేజి కుర్రోళ్లు అమ్మాయిల వెంట పడకుండా పోలీసు డిపార్టుమెంట్‌వాళ్లు కట్టడి చేసారట కదా!
సుశీల: నాకూ అదే బాధగా ఉందే!

### బ్యాంక్ బ్యాలన్స్

రవి: ఒరే గోపీ! రంగా ప్రేమించిన అమ్మాయితో నీకు పెళ్లి అయిందేమిట్రా?
గోపి: వాడి కన్నా నా బ్యాంక్ బ్యాలెన్స్ ఎక్కువుంది మరీ.

### రాఖీలు

భార్య: ఎక్కడి నుంచి ఉత్తరం?
భర్త: అమ్మాయి దగ్గర నుంచి.
భార్య: ఏంటి విశేషాలు?
భర్త: అక్కడ రాఖీలు దొరకడం లేదట. రాఖీలు పంపించమంది. చుట్టుపక్కల అమ్మాయిల చేత అల్లుడు గారికి కట్టించడానికి.

### అప్పు

భర్త భార్యతో: ఈ వీధిలో నీ బట్టలు నేను ఉతుకుతున్నానని చెప్పినా పర్వాలేదుగానీ మీ అమ్మ బట్టలు కూడా నేనే ఉతుకుతున్నానని చెప్పకే.
భార్య: ఏం? ఎందుకని??
భర్త: పక్కింటి సుబ్బారావు అప్పు ఇవ్వడం మానేస్తాడు.

### ఎక్కడ?

కాంతం: వరలక్ష్మిగారూ! కొత్తమీర, కరివేపాకు మీరు ఎక్కడ కొంటున్నారు?
వరలక్ష్మి: నాకు ఆ అవసరం లేదండీ!
కాంతం: మరెలా?
వరలక్ష్మి: నాకు ఎప్పుడు అవసరం వచ్చినా పక్కింటి విజయ దగ్గరే తీసుకుంటాను.

**- వైదా ఈశ్వరరావు,** విశాఖపటం

## జోక్స్‌కు ఆహ్వానం

మీరు పంపే జోక్స్ హాస్యాన్ని పండించేలా ఉండాలి.
కాపీ జోక్స్‌ను పంపకండి. చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-500 080
sunmagvaartha@gmail.com




**పొలం** గట్ల మీదనో, రహదారి పక్కనో నాగజెముడు మొక్క కనిపిస్తే కొందరు ఈ ముళ్లమొక్క ఇక్కడెందుకని పీకి పారేస్తుంటారు. పెరిగితే మనకెందుకులే అని మరికొందరు అనుకుంటారు. మనం పట్టించుకోని ఆ మొక్కని వందల సంవత్సరాల నుంచీ అమెరికన్లు ముఖ్యంగా మెక్సికన్లు సాగు చేసి దాని కాండాన్ని, పండ్లనీ తింటున్నారు. ఇప్పుడిప్పుడే మన దేశంలోనూ నాగజెముడు సాగుని మొదలుపెట్టారు. ఇవి కరువుని సైతం తట్టుకుంటాయి. పైగా తక్కువ పెట్టుబడి. దాంతో

# ముళ్లపండులో సుగుణాలు మెండు

నీటి సదుపాయం లేని చోట్ల చాలా మంది ఈ కాక్టస్‌ను పెంచేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ముళ్లతో ఉన్న ఈ మొక్కల్ని ఎలా తింటారని అనిపిస్తుంది ఎవరికైనా. అందుకే ఇప్పుడు సంకరీకరణ ద్వారా ముళ్ల పరిమాణాన్ని బాగా తగ్గిస్తున్నారు. ఆ కొద్దిపాటి ముళ్లు కూడా చాకుతో గీరితే ఊడిపోతాయట. దీన్ని పండించడం చాలా సులభం. ముక్కలుగా చేసిన కాండాల్ని నేలలో పాతితే ఏడాదికల్లా పెరిగి రెండు మూడేళ్లకే కాస్తాయి. అయితే పండ్ల మీద ఉన్న ముళ్లను తొలగించి తినడం పూర్వం నుంచీ మన దగ్గర కూడా వాడుకలో ఉంది. ఈ పండుని అమెరికన్లు ట్యూనా ఫ్రూట్, ప్రిక్లీ పియర్, నోపల్, ప్యాడల్ కాక్టస్ అని పిలుస్తారు.

## ఈ పంటే ఎందుకు?

ఎడారి ప్రాంతాల్లో పెరిగే కాక్టస్ మొక్కల ఆకులన్న కనీ కనిపించనంత చిన్నగా/ముళ్ల రూపాన్ని సంతరించుకుంటాయి. దాంతో కాండాలే ఆకుల్లా మారి ఆహారాన్ని తయారు చేసుకుంటాయి. ఎడారిలో నీరు దొరకదు కాబట్టి, ఉన్న కాస్త నీటినీ ఆ కాండంలోనే నిల్వ చేసుకుంటాయన్నమాట. ఈ నాగజెముడు కూడా అలాంటి మొక్కే. దీని పండ్లు, కాండం ఆరోగ్యానికి మేలు చేస్తుందని గుర్తించారు పోషక నిపుణులు. దాంతో ఈ పండ్ల నుంచి నీటిని సేకరించి విక్రయిస్తున్నారు. కొబ్బరి నీళ్లలో మాదిరిగానే వీటిల్లోనూ పొటాషియం, మెగ్నీషియం శాతం ఎక్కువ. దాంతో కండరాల సమన్వయానికీ గుండె పనితీరుకి మంచిదన్న




కారణంతో ఈ నీటికీ డిమాండ్ పెరిగింది. ఈ పండ్ల గుజ్జుతో జ్యూసులు, జామ్‌లు, జెల్లీలు సైతం తయారు చేస్తున్నారు. ముళ్లు తొలగించిన కాండాల్ని కూరలు, సలాడ్లలోనూ వేసుకుంటున్నారు. అంతేకాదు, హైపో గ్లైసీమియా, మధుమేహం, కొలెస్ట్రాల్, ఊబకాయం మొదలైన వ్యాధుల్ని నివారించే మందులు, షాంపులు, క్రీములు, బాడీ లోషన్లు వంటి కాస్మొటిక్స్ తయారీలోనూ దీనిని వాడుతున్నారు.


## ఉపయోగాలు


కాక్టస్ ఆకుల్లో 88 శాతం పిండి పదార్థాలు, కొద్ది మొత్తంలో ప్రొటీన్లూ, కొవ్వులూ ఉంటాయి. వంద గ్రా. కాండాల నుంచి 41 క్యాలరీతో పాటు రోజువారీ అవసరమైన సి-విటమిన్‌లో 17 శాతం, 24 శాతం మెగ్నీషియం లభిస్తాయి. ఈ కాక్టస్ ఆకుల్లోనూ, పండ్లలోనూ యాంటీ ఆక్సిడెంట్ల శాతం ఎక్కువ. ఇవి వైరస్‌లను అడ్డుకోవడంతో పాటు నాడీకణాల పనితీరునీ ప్రభావితం చేస్తాయి. వీటిల్లోని ఫ్లేవనాయిడ్లు రొమ్ము, ప్రోస్టేట్, పొట్ట, క్లోమ, గర్భాశయ, అండాశయ, ఊపిరితిత్తుల కేన్సర్లు తగ్గేందుకు సాయపడతాయి. రక్తంలో చక్కెర నిల్వల్ని నియంత్రించేందుకు, ప్రోస్టేట్ గ్రంథుల వాపును తగ్గించేందుకు సైతం తోడ్పడుతాయి ఈ పండ్లు. ఇంకా విటమిన్ ఎ, సి,ఇ, బి6, ఫోలేట్, ఐరన్, రిబోఫ్లేవిన్, నియాసిన్, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటివి లభిస్తాయి. వీటి ల్లోని పీచు ఆకలినీ, చెడు కొలెస్ట్రాల్‌నీ తగ్గిస్తుంది. ఈ పండ్లలోని బెటానిన్ అనే పదార్థం జఠర రసాలు ఊరేలా చేస్తుందనీ, అందుకే ఈ పండును తినడం వల్ల జీర్ణశక్తి మెరుగై మలబద్ధకం లేకుండా ఉంటుందనీ అంటున్నారు.

ఈ పండ్లలోని యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడం ద్వారా కాలేయాన్ని కాపాడాతాయట. అలాగే పొటాషియం బీపీని తగ్గించి, గుండెకు మేలు చేస్తుంది. అంతేకాదు, కాక్టస్ పాడ్స్‌లోని తేమ శిరోజాలకు, చర్మ సౌందర్యానికి ఎంతో మేలు చేస్తుందని అనేక పరిశోధనల వల్ల తెలుస్తోంది. ❏

# ఈ వారం కా'ర్టూన్స్'


ఏంటే.. ఆ కోళ్లీకి-అందరూ సానుభూతి తెలియజేస్తే.. మీరు 'ప్రగాఢ' సానుభూతి తెలియజేసార్ట..?
Zakir...


...అతను ఓటమి అంగీకరించాడు తెల్సా...!
Zakir...


..నేను మళ్లీ చేస్తా బేబీ... గేట్ దగ్గర ఎవడో వచ్చాడు.. చూసి మొరగాలి నేను...!!
Zakir...

# ఫోటో ఫీచర్



అన్ని బ్యారెల్సే కదా ఉన్నాయి.. ఇందులో వింతేముంది అనుకుంటున్నారా? ఇదొక హోటల్. విశాలమైన తోటలో ఉంది. ఈ హోటల్‌లోని గదులు పీపాల ఆకారంలో ఉంటాయి కనుక దీనిని 'మాటిసెస్ హోటల్ డి బారికాస్' పీపాల హోటల్' అని అంటారు. ఇది మెక్సిలోకి లాకోఫ్రాడియాలో ఉంది. గదులు పీపాల ఆకారంలో ఉన్నా మిగతా హోటల్స్‌లో ఉండే లగ్జరీ సదుపాయాలన్నీ ఉంటాయిందులో.







